
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 18 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 26.4 । కనిష్ఠం 15.4

వారంతా వాచ్‌మెన్‌లు.. వయోభారంతో శరీరం సహకరించకపోయినా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రివేళ ఎముకలు కొరికే చలిలోనూ కాపలా ఉద్యోగాలు చేస్తున్నారు. 16 డిగ్రీల చలిలో పాతికేళ్ల యువకులు సైతం గజగజా వణుకుతున్న వాతావరణంలో ఈ వృద్ధ వాచ్‌మెన్‌లు కళ్లల్లో ఒత్తులు వేసుకొని కాపలా కాస్తున్నారు. ఈదురుగాలిని తట్టుకొని ఒక చేతిలో కర్ర, మరో చేతిలో లైటు పట్టుకొని, గొంతులో వణుకు వస్తున్నా దిగమింగుకొని పనిచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నల్లగొండలో వాచ్‌మన్‌లుగా విధులు నిర్వహిస్తున్న వృద్ధులు

ముదిమి వయసులో
మూలుగుతూనే..

- చలికి వణుకుతున్నా కుటుంబ భారం మోయక తప్పని పరిస్థితి
- ఇంటికి ఆసరాగా ఉంటామని వాచ్‌మన్లుగా విధులు
- అరకొర వేతనాలతో శ్రమదోపిడీ
- ప్రశ్నిస్తే ఉన్న ఉద్యోగమూ ఉండదనే ఆందోళన
- చలికోట్లు, మఫ్లర్లు కూడా ఇవ్వని యాజమాన్యాలు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వృద్ధ కాపలాదారుల అవస్థలు వెలుగులోకి...

చలిని తట్టుకునేందుకు, ఈదురుగాలుల నుంచి కాపాడుకునేందుకు అవసరమైన చలికోట్లు (స్వెట్టర్లు), మఫ్లర్లు, బూట్లు, కాసేపు మేనువాలిస్తే కప్పుకోవడానికి రగ్గులు, గొంగడి వంటివేవీ వాచ్‌మన్‌లకు అందుబాటులో లేవు. గజగజా వణికే చలిలో ఏజెన్సీలిచ్చిన డ్రస్సు ధరించి కొందరు వారు విధులు నిర్వర్తించాల్సిన చోట స్టూల్‌పైనే కూర్చొని కాపలా కాస్తుంటే, మరికొందరు లైటు, కర్ర పట్టుకొని వారి బీట్‌చుట్టూ పహారా కాస్తున్నారు. భవన నిర్మాణాల వద్ద ఉండే వాచ్‌మెన్‌ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇక్కడ ఉండే వాచ్‌మెన్‌లు 60 ఏళ్లకు పైబడ్డవారే కావడంతో చలికి వణుకుతున్నారు. చలిని తట్టుకునే ఎలాంటి సదుపాయాలు వీరికి కూడా అందుబాటులో లేవు. పైగా రాత్రివేళ పని ప్రదేశం వద్ద ఏదైనా వస్తువు చోరీకి గురైతే ఉదయం మళ్లీ యజమానుల నుంచి చివాట్లను ఎదుర్కోవాల్సిన దయనీయ స్థితి వీరిది. వాచ్‌మెన్‌లకు కనీస వేతనాలివ్వకపోగా, పనిప్రదేశాల్లో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించకుండా శ్రమదోపిడీ చేస్తున్న దుస్థితి 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగు చూసింది. నల్లగొండ పట్టణంలోనే కాదు, ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి,చౌటుప్పల్ పట్టణాల్లో పలువురువృద్ధులు వాచ్‌మన్‌లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటీఎంల వద్ద,దుకాణ సముదాయాల వద్ద, భవన నిర్మాణ పనులవద్ద,అపార్ట్‌మెంట్లవద్ద, గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ల వద్ద పనిచేస్తున్న వాచ్‌మెన్‌ల అందరి పరిస్థితి ఒకేలాగే ఉంది.

అరకొర వేతనాలు

నల్లగొండ ఉమ్మడి జిల్లాలో సెక్యూరిటీ ఏజెన్సీల పరిధిలో పనిచేసే వాచ్‌మన్‌లు శ్రమదోపిడీకి గురవుతున్నారు. వీరిలో రాత్రిపూట వాచ్‌మన్‌గా ఉద్యోగం నిర్వర్తించేవారు ఎక్కువ పనిగంటలు కూడా పనిచేస్తున్నారు. ఏటీఎంల వంటి చోట్ల 8గంటల పాటు పనిచేస్తే నెలకు రూ.8,000 ఇస్తున్నారు. షోరూమ్‌లు, ఇతర దుకాణాల వద్ద సాయంత్రం 7 నుంచి ఉదయం 7గంటల వరకు పనిచేస్తే రూ.10వేల నుంచి రూ.12వేలు యజమానులు చెల్లిస్తున్నారు. రాత్రివేళ పనిచేసే వాచ్‌మన్‌లు సుమారు 55 ఏళ్ల వయసుకు పైబడ్డవారే ఉన్నారు. అయినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఎంతో కొంత ఆసరాగా ఉంటామనే ఉద్దేశంతో తక్కువ వేతనాలకైనా పనిచేస్తున్నారని. నెలకు కేవలం రెండు రోజులే సెలవులిస్తారని, అంతకుమించి సెలవులు తీసుకుంటే వేతనంలో...

- మిగతా 6వ పేజీలో...

ఆంధ్రజ్యోతి పరిశీలన

చలైనా, వానైనా డ్యూటీ తప్పదు



నేనుకొన్నేళ్లుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నా, రాత్రంతా డ్యూటీ చేస్తే నెలకు రూ.11వేల వేతనమిస్తారు. చలైనా, వానైనా పహారా తప్పదు. రాత్రివేళ కళ్లల్లో ఒత్తులు వేస్కొని మేల్కొని ఉండాల్సిందే. ఏ చిన్న పొరపాటు జరిగినా మళ్లీ మేమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాత్రంతా షోరూమ్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిందే. స్విట్టర్లు, రగ్గులు ఏమీ ఇవ్వరు. కేవలం యూనిఫాం మాత్రమే ఇస్తారు. పెరిగిన వయసు చలికి తట్టుకోలేకపోతున్నా, కుటుంబ బాధ్యతలతో పనిచేయక తప్పడం లేదు.

- మారగోని సూరయ్య, 53 ఏళ్లు, గడ్డికొండారం, తిప్పర్తి మండలం

పని చేస్తేనే కుటుంబం గడుస్తుంది

రెక్కాడితేనే దొక్కాడే కుటుంబం మాది. ఇక్కడే గుడిసె వేసుకొని ఉంటున్నాం. రాత్రి పూట వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నా, రూ.7500 వేతనం ఇస్తున్నారు. నా భార్య, నేను ఇక్కడే పనిచేస్తున్నాం. ఇద్దరం పనిచేస్తేనే కుటుంబం గడుస్తుంది. పని వెతుక్కోవడమే తప్ప, సదుపాయాలు, వసతులు అడిగే పరిస్థితి మాకు ఉండదు. చలికాలమైనా, వానాకాలమైన సర్దుకొని పనిచేస్తేనే కుటుంబం గడుస్తుంది. అంతకంటే మేం చేసేదేమీలేదు. చలికోట్లు, రగ్గులు కొనుగోలు చేసే స్థోమత మాకు లేదు. ఎవరైనా పాతవి ఇస్తే వాటినే ధరిస్తున్నాం.

- గుండె ఎల్లయ్య (62), ఉల్సాయిపాలెం, నల్లగొండ జిల్లా





గిరిప్రదక్షిణ దారిలో నిర్మాణంలో ఉన్న యాదరుషి మండపం

యాదరుషి,భక్త ప్రహ్లాదకు
ప్రత్యేక మండపాలు

- గిరి ప్రదక్షిణ దారిలో నిర్మాణం
- రెండో ఘాట్ రోడ్డులో యాదరుషికి మండపం
- సత్యనారాయణస్వామి వ్రత మండపం వెనుక భక్త ప్రహ్లాద మండపం
- తుది దశలో పనులు
- స్వామివారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని విగ్రహాల ప్రతిష్ఠ

యాదాద్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కోసం యాదగిరిగుట్టపై మహా తపస్సు చేసినయాదరుషి, పరమ భక్తుడు భక్త ప్రహ్లాదుడిని దర్శించుకునేలా ప్రత్యేక మండపాలను భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పుణ్యక్షేత్రానికి కారణమైన యాదరుషితో పాటు భక్తప్రహ్లాదుడికి గిరి ప్రదక్షిణ దారిలో మండపాలు నిర్మించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గిరి ప్రదక్షిణ దారిలో యాదరుషి మండపాన్ని రెండోఘాట్ వద్ద, ప్రహ్లాదుడి మండపాన్ని సత్యనారాయణస్వామి వ్రత మండపం వెనుక గిరి ప్రదిక్షణదారి వెంట నిర్మించారు. వారం రోజుల్లోగా ఇక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఒక్కో మండప నిర్మాణానికి రూ.4లక్షలు, మొత్తంగా రూ.8లక్షలతో మండపాల నిర్మాణంతోపాటు చుట్టుపక్కన గార్డెనింగ్, భక్తులు దర్శనార్థం మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఈ నెల 26న స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా అందుబాటులోకి తేనున్నారు.

'గిరి ప్రదక్షిణ' భక్తులకు సౌకర్యాలు

స్థానిక భక్తులు యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకోవడం

- మిగతా 6వ పేజీలో...

ఆధ్యాత్మికంగా.. ఆధునికంగా..

యాదరుషితో పాటు భక్త ప్రహ్లాదుడి పేరు మీద యాదగిరిగుట్ట ప్రసిద్ధికెక్కింది. ఆలయ పునర్నిర్మాణం,విస్తరణలో భాగంగా యాదరుషి విగ్రహాన్ని కొండ కింద తులసి కాటేజీ వద్ద మర్రి చెట్టు వద్ద ఏర్పాటుచేశారు. రోడ్డు డివైడర్‌కు పక్కనే ఉండటంతో యాదరుషిని భక్తులు దర్శించుకునే వెసులుబాటు లేకుండా పోయింది. దీంతో యాదరుషి మండపాన్ని మరోచోట ఆధ్యాత్మికంగా..ఆధునికంగా నిర్మించాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు కొండ కింద గిరి ప్రదక్షిణ దారిలో మండపాలను నిర్మించారు. యాదరుషి, భక్త ప్రహ్లాదుడి విగ్రహాలతో పాటు గుట్ట ప్రాశస్త్యం కూడా మండపాల వద్ద లిఖిత రూపంగా అందుబాటులో ఉంచనున్నారు.

ఆంధ్రా నుంచి ధాన్యం

- చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ బందోబస్తు
- సరిహద్దుల్లో అదనంగా మరో రెండు ఏర్పాటు



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న కోదాడ రూరల్ ఎస్ఐ, సిబ్బంది

ఆంధ్రా నుంచి పెద్ద మొత్తంలో ధాన్యం వస్తుండడంతో అధికారులు అప్రమత్తమై ఇప్పటికే సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచారు. దీంతోపాటు అదనంగా మరో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ రూరల్)

రాష్ట్రంలో ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటా కు రూ.500 బోనస్ ఇస్తోంది. దీంతో ఏపీ రాష్ట్రం నుంచి కొంతమంది దళారులు రాత్రివేళల్లో సరిహద్దు చెక్‌పోస్టును తప్పించుకుని అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రామాపురం క్రాస్ రోడ్డు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అధికారులు బందోబస్తును పటిష్ఠపరిచారు. సోమవారం అర్ధరాత్రి 20కి పైగా లారీల్లో వచ్చిన ధాన్యాన్ని గుర్తించి వెనక్కిపంపినట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు. దీంతో దళారులు మరిన్ని అడ్డదారులు వెతుక్కున్నారు. చెక్‌పోస్టుకు సుమారు 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నవరం గ్రామం నుంచి రెడ్లకుంట, కాపుగల్లు గ్రామాల మీదుగా కోదాడ, అక్కడి నుంచి సూర్యాపేటకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. అంతేగాక రాత్రివేళలో ఖమ్మం జిల్లా మీ దుగా లారీలు కొండపల్లి, అనంతగిరి మండలం గోండ్రియాల మీదుగా కోదాడ మిల్లులకు ధాన్యం తరలిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఏపీ రాష్ట్రం జగ్గయ్యపేట, వత్సవాయి మం డలాల నుంచి ధాన్యం రాత్రివేళలో పెద్ద మొత్తం లో కోదాడకు వస్తోంది. దీన్ని గుర్తించిన అధికారు లు చెక్‌పోస్టుల వద్ద బందోబస్తు పటిష్ఠం చేయడంతోపాటు అన్నవరం, రెడ్లకుంట మధ్య మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా నుంచి ధాన్యం రాకుండా అనంతగిరి మండలం గోండ్రియాల వద్ద మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీంతో ఏపీ నుంచి ధాన్యం వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఏపీ ధాన్యాన్ని కట్టడి చేయాలి

(ఆంధ్రజ్యోతి, అనంతగిరి, మేళ్లచెర్వు, మఠంపల్లి): మండల పరిధిలోని గోండ్రియాల గ్రామం మీదుగా ఏపీ రాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా కట్టడి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం పౌరసరఫరాలశాఖ రాజేశ్వరరావుతో కలిసి గోండ్రియాల గ్రామంలో చెక్‌పోస్టు ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్, రెవెన్యూ శాఖలు రెండు బృందాలుగా ఏర్పడి చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్లు వాజిద్ అలీ, హిమబిందు, ఎస్ఐ అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చింతలపాలెం మండలంలోని కృష్ణానదిపై ఉన్న చింతిర్యాల బల్లకట్టు, పులిచింతల ప్రాజెక్టు, బుగ్గమాదారం బల్లకట్టు, దొండపాడు చెక్‌పోస్టు, మేళ్లచెర్వు మండలంలోని రామాపురం చెక్‌పోస్టులను అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. మఠంపల్లి మండలం మట్టపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఇక్కడ గతంలో ఇద్దరు పోలీసులు ఉండగా, మరో ఇద్దరిని అదనంగా కేటాయించి పటిష్ఠంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు సురేందర్‌రెడ్డి, మంగా, డీటీసీ ఎస్‌లు రాంరెడ్డి, రాజశేఖర్, చింతపాలెం ఎస్ఐ అంతిరెడ్డి, ఆర్ఐ వాసుదేవరావు, తదితరులు ఉన్నారు.

19న జేడీఏతో శ్రవణ్‌కుమార్‌తో
'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'

సంప్రదించాల్సిన నంబర్ 7288800023

ఉదయం 11 నుంచి 12 గంటల వరకు



నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో విత్తనాలు, ఎరువులు మొదలుకుని రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. గురువారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు జేడీఏ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులు అడిగే ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు ఇవ్వనున్నారు. రైతులు ఫోన్ నెంబర్ 7288800023లో సంప్రదించాలి. జిల్లాలోని రైతులంతా ఈ కార్యక్రమం ద్వారా విలువైన సమాచారం తెలుసుకునే వీలుంది.

చట్టంలో డిజిటల్ అరెస్టు లేదు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, ఫెడెక్స్ కొరియర్ అంటూ జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం తన కార్యాలయం ఆయన మాట్లాడారు. ఇటీవల ముంబై పోలీసులమని సైబర్ నేరస్థులు సామాన్య ప్రజలను, ఉద్యోగులను టార్గెట్ చేసుకున్నారన్నారు. ఫోన్ చేసి ముంబై నార్కోటిక్స్, సీబీఐ పోలీసులమని ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు చెప్పి, ఓ పార్సిల్ ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్ దేశాలకు వెళ్లేందుకు బుక్ అయిందని, అందులో నార్కోటిక్స్ డ్రగ్స్ ఉన్నాయని, కేసు బుక్ చేస్తున్నామని మోసగిస్తారని వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసు నమోదుకాకుండా ఉండాలంటే వెంటనే డబ్బు పంపాలని కోరతారని, ఎవరికీ డబ్బు పంపవద్దని సూచించారు. అలాగే బ్యాంకు లోను తీసుకునే విధంగా చేసి, ఆ డబ్బు వారికి పంపాలని మోసాలు చేస్తున్నారని అన్నారు. ముంబై నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ అని చెప్పి నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో ఓ బాధితురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ.5లక్షలు లూటీ చేశారని వివరించారు. ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో నల్లగొండ టూటౌన్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. ప్రజలు, యువత, ఉద్యోగులు ఇలా వచ్చిన ఫోన్స్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి ఘటన ఎదురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదంటే సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో రిపోర్టు చేయాలని ఎస్పీ సూచించారు.

మరింత పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రత

15.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయి. రోజురోజుకూ చలిగాలుల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం 16.0డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మంగళవారం 15.4డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఆరురోజులుగా చలి గాలులు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి.పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అందరికీ ఉపయోగపడేలా

- ఉపాధి పనుల జాతర
- ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు



యాదాద్రి జిల్లా ముశిపట్ల నర్సరీలో మొక్కల పెంపకానికి బ్యాగులో మట్టి నింపుతున్న కూలీలు

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు ఎక్కువ గా కంపచెట్ల తొలగింపు, చెరువుల పూడికతీత పనులే జరిగేవి. కూలీలలను ఎక్కువగా రప్పించేందుకు అధికారులు ఈ పనులు ఎంచుకునే వారు. కొన్నిచోట్ల పడావుబడిన భూముల్లో భూఅభివృద్ధి పేరుతో కంప చెట్లు తొలగించేవారు. ఆ రైతు ఆ భూమిని వెంటనే సాగులోకి తేక వదిలేస్తే అక్కడ మళ్లీ కంపచెట్లు పెరిగేవి. రోడ్ల వెంట పెరిగిన కంప చెట్లు కొట్టినా అదే పరిస్థితి ఉండేది. దీనికి కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉపాధి హామీలో వైవిధ్యమైన (పలు రకాల) పనులు చేపట్టాలని ఆదేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ పనుల జాతరను చేపట్టింది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధిహామీ జాబ్ కార్డులు 7.65లక్షల వరకు ఉన్నాయి. అందులో యాదాద్రి జిల్లాలో 1.43లక్షలు, సూర్యాపేట జిల్లాలో 2.63లక్షలు, నల్లగొండ జిల్లాలో 3.59 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి పనుల జాతరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు ఉపయోగపడే పనులు ఎక్కువగా చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. మహిళా శక్తి ఉపాధి భరోసా కింద ఐదు రకాల పనులు చేపట్టనున్నారు. ఐకేపీ నుంచి పాడి పశువులు తీసుకున్న వారికి పశువుల దొడ్డి నిర్మిస్తారు. అజోలా పెంపకం, వర్మీ, నాడెపు కంపోస్టు ఎరువు తయారీ, కోళ్ల పెంపకం, భూఅభివృద్ధి పనులు చేపడతారు. పొలంబాట కింద వ్యవసాయ బావుల వద్దకు రహదారుల నిర్మాణం చేపడతారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామానికి ఒక యూనిట్ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ మండలానికి ఐదెకరాల చొప్పున పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. జల నిధి కింది గల్లీ కంట్రోల్ వర్క్సగా చెల్కల్లో వరదలు పారే చోట వరద నీరు ఒకే సారి ప్రవహించి భూమి

- మిగతా 6వ పేజీలో...

సర్వే బృందాలకు సమాచారం ఇవ్వాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు సర్వే బృందాలకు సరైన సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన జరుగుతోందన్నారు. అధికారులు దరఖాస్తుదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారని, వారు వచ్చే సమయంలో అందుబాటులో ఉండాలని కోరారు. సర్వే బృందాలకు ప్రస్తుతం ఉన్న ఇంటి వివరాలు ఫొటోతో సహ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. సర్వే నెమ్మదించిన మండలాల్లో కారణాలను విశ్లేషించి నివేదిక అందజేయాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అధికారులు సర్వేకు వచ్చే రోజు సమాచారాన్ని ప్రజలకు ముందుగా తెలియజేయాలన్నారు. ఏదైనా కారణంతో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేయని వారు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయవచ్చన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ కోసం గతంలో దరఖాస్తు చేసుకోని వారు సైతం ఈ కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన యుద్ధప్రాతిపదికన చేయాలని, 500 ఇళ్లు దాటినచోట ప్రతీ మండలానికి ఒక కొత్త యూజర్ ఐడీ క్రియేట్ చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు బ్రాహ్మణవెల్లెంలలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుకు వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ ఇలాత్రిపాఠిని కలిశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశమై వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలి

(కట్టంగూరు, ఆంధ్రజ్యోతి): ఆధునిక యంత్రాలు ఉపయోగించి రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. రైతులు సంఘటితంగా ఏర్పడి సాగులో సాంకేతికను ఉపయోగించడం అభినందనీయమన్నారు. ఎఫ్‌పీవో అభివృద్ధి కోసం తనవంతు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేడీఏ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీవో ఛైర్మన్ చెవుగోని సైదమ్మ, ఏవో గిరి ప్రసాద్, వాడపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముదిమి వయసులో మూలుగుతూనే..

(5వపేజీ తరువాయి)

కోత విధిస్తారని పలువురు వాచ్‌మన్‌లు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వాపోయారు.

భవన నిర్మాణాల వద్ద, అపార్ట్‌మెంట్ల వద్ద..

నల్లగొండతో పాటు మిర్యాలగూడ, భువనగిరి, చౌటుప్పల్, ఇతర పట్టణాల్లో భవన నిర్మాణాల వద్ద పనిచేసే వాచ్‌మన్‌ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఇక్కడ పూర్తిగా వయోవృద్ధులనే వాచ్‌మన్‌లుగా నియమించుకుంటున్నారు. వృద్ధాప్యంలో బలమైన పనులు చేయలేక, కుటుంబ పోషణ నిమిత్తం పలువురు వృద్ధులు ఈ విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రివేళ నిద్రపోకుండా కాపలా ఉండడంతో పాటు, నిర్మాణాల వద్ద ఉండే ఇటుకలు, సిమెంటు, ఇసుక, ఇనుము, ఇతర సామగ్రి ఎవరూ దొంగలించకుండా తరచూ పారాహుషార్ అంటూ లైట్ వేస్తూ, అర్పుతూ కేకలు వేయడంతో పాటు, నిద్రపోకుండా కాపలాగా ఉంటున్నారు. నల్లగొండ పట్టణంలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన సందర్భంగా సుమారు 20వరకు నిర్మాణ ప్రాంతాలు, మరో 10 అపార్ట్‌మెంట్ల వద్ద గమనించగా మొత్తానికి మొత్తం 60ఏళ్ల పైబడ్డ వయసున్న వారే వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్న విషయం తేలింది. తీవ్రమైన చలి, జోరుగా కురిసే వానల్లో సైతం రాత్రి వేళ నిద్రపోకుండా కఠినంగా మెలుకువ ఉండి పనిచేసే వీరికి వేతనాల విషయానికి వస్తే నెలకు రూ.6వేల నుంచి రూ.7వేలకు మించి ఇవ్వని దయనీయస్థితి ఉంది.

కనీస వసతులు కరువు

పని ప్రదేశాల వద్ద, భిన్న వాతావరణ పరిస్థితుల్లో సైతం పనిచేస్తున్న వాచ్‌మన్‌లకు కనీస వేతనాలే కాదు, కనీస వసతులు సైతం అందుబాటులో ఉంచడం లేదు. తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంతో వీళ్లే బాటిళ్లలో నీరు తెచ్చుకొని వాడుకుంటున్నారు. వాష్‌రూమ్‌లుగానీ, గార్డ్‌రూమ్స్‌గానీ వీరికి ఉండడం లేదు. కనీసం శీతాకాలంలో చలి తట్టుకోవడానికి అవసరమైన రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్ల వంటి వాటిని కూడా సరఫరా చేయలేదు. అత్యంత దుర్భరమైన పరిస్థితిలో వాచ్‌మన్‌లుగా వయోవృద్ధులు పనిచేస్తున్నారు. పలు భవన నిర్మాణాల వద్ద అక్కడే పక్కన తడికలు అడ్డుపెట్టుకొని తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని కొందరు, మొదటి ఫ్లోర్ శ్లాబ్ పడ్డాక, దాని కిందనే మంచం ఏర్పాటుచేసుకొని మరి కొందరు చలిలో సైతం మెలకువగా ఉండి కాపలాకాస్తున్నారు.



డ్యూటీ సమయంతా మేల్కొని ఉండాల్సిందే

నేను ఏటీఎం వద్ద కాపలాదారుడిగా పనిచేస్తున్నా. షిఫ్టుకు 8గంటల సమయం పనిచేయాల్సి ఉంటుంది. రాత్రి డ్యూటీ అయినా ఆ 8గంటలు కుర్చీపై కూర్చొని మెలకువగా ఉండాల్సిందే. స్వెట్టర్లు, రగ్గులు మాకు ఎవరిస్తారు? చలి వేసినా తప్పడం లేదు. సొంతంగా కొనుగోలుచేసే స్థోమత మాకు లేదు.

జి.సురేందర్, 52ఏళ్లు, ఏటీఎం కాపలాదారు, నల్లగొండ



బతుకుదెరువు కోసం తప్పడం లేదు

నాకు 70 ఏళ్లు. అయినా వాచ్‌మన్‌గా పనిచేయక తప్పడం లేదు. రాత్రిపూట బిల్డింగు పనివద్ద కాపలా ఉంటే నెలకు రూ.7వేలు ఇస్తారు. ఈమధ్య చలిబాగా పెరిగింది. కానీ, పనికి రాక తప్పడం లేదు. పనికి రాకపోతే పూటగడవదు. ఈ వృద్ధాప్యంలో వేరే పనిచేయలేను. అందుకే ఎలాగో ఓర్చుకొని వాచ్‌మన్‌గా పని చేస్తున్నా. రగ్గులు, చలి కోట్లు మాకెవరిస్తారు. ఉన్న దుప్పట్లతో సర్దుకోవాల్సిందే.

జెరిపోతుల సైదులు, 70 ఏళ్లు, అర్జాలబావి, నల్లగొండ

చలి చంపుతోంది..
బతుకు సాగమంటోంది

● గజగజ వణుకుతున్న అభాగ్యులు ● రోడ్డు పక్కన చలిలోనే సర్దుకుంటున్న వైనం ● జనరల్ ఆస్పత్రిలో రోగుల సహాయకుల దీనస్థితి ● బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు తప్పని చలి బాధ





జిల్లాకేంద్రంలో చలికి వణుకుతూ..



నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 15 డిగ్రీల చలిలో స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి, ఇళ్లలో నిద్రించేవారే చలికి తట్టుకోలేకపోతున్న సందర్భంలో అనాథలు, గూడులేని పేదలు, యాచకులు చలికి తలదాచుకునే తావులేక ఇబ్బంది పడుతున్నారు. నల్లగొండ పట్టణంలో సోమవారంరాత్రి 12 నుంచి 1.30 సమయంలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన సందర్భంలో పట్టణంలో నిరాశ్రయుల చలిబాధలు కళ్లకు కట్టాయి. క్లాక్‌టవర్ వద్ద మెట్ల మీద, నల్లగొండ-హైదరాబాద్ రోడ్డు వెంట దుకాణాల షెట్టర్లను ఆనుకొని వందల సంఖ్యలో నిరాశ్రయులు, అనాథలు, యాచకులు తలదాచుకుంటున్న పరిస్థితి కన్పించింది. పలుచటి దుప్పట్లు తప్ప రగ్గులు, స్వెట్టర్ల వంటి చలి తట్టుకునే వస్త్రాలు వారికి అందుబాటులో లేవు. రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద కూడా దాదాపు ఇదే పరిస్థితిలో వందలాది మంది తలదాచుకుంటున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద వీరితోపాటు బస్సులు అందక నిలిచిపోయిన ప్రయాణికులు సైతం చలికి అవస్థలు పడుతున్నారు. ఇటు బస్టాండ్ వద్ద కానీ, అటు రైల్వే స్టేషన్ వద్ద కానీ ప్రయాణికులకు రెస్ట్‌రూమ్‌లేవీ అందుబాటులో లేవు. అనాథలకోసం ఉద్దేశించిన పట్టణ నిరాశ్రయుల ఆశ్రమం కూడా పనిచేయడం లేదు. పేరుకు మాత్రమే భవనమున్నా ఇక్కడ ఎలాంటి సదుపాయాలు, వసతులు కల్పించడం లేదు. దీంతో పట్టణంలో చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పలువురు ఇబ్బందులు పడక తప్పని దయనీయ స్థితి నెలకొంది.

ఆరుబయటే రోగుల సహాయకులు

నల్లగొండ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ రోగులకు సహాయకులుగా వచ్చేవారు తలదాచుకోవడానికి ఎలాంటి సదుపాయాలు అందుబాటులోలేవు. గదులను ఏర్పాటు చేసినా వాటికి సిబ్బంది తాళాలు వేసుకొని వెళుతుండడంతో రోగుల సహాయకులు ఆస్పత్రి ఆవరణలో బెంచీలపైనా, ఆరుబయట నేలపైనే దుప్పట్లలో తలదాచుకుంటున్నారు. లాడ్జిల్లో ఉండే స్థోమతలేక, రోగికి అందుబాటులో లేకపోతే ఏసమయంలో ఏ అవసరమొస్తుందోననే ఆస్పత్రి వద్దే ఉంటున్నామని, ఎముకలు కొరికే చలి అయినా భరించకతప్పడం లేదని పలువురు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అందరికీ ఉపయోగపడేలా

(5వపేజీ తరువాయి)

కోత గురికాకుండా ఒక దాని తర్వాత ఒకటి (స్టెప్ బై స్టెప్) వరద కట్టల నిర్మాణం మండలానికి రెండు చేపడతారు. ప్రతీ మండలానికి ఒక చెక్‌డ్యామ్, ఫామ్‌పండ్స్ మండలానికి ఐదు, భవనాలపై నుంచి వచ్చే నీటి నిల్వ గుంతలు మండలానికి ఐదు, బోర్‌వెల్ రీచార్జి గుంతలు మండలానికి రెండు, నూతన బావుల తవ్వకం మండలానికి ఒకటి, గ్రామీణ పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన కింద మండలానికి పది ఇంకుడు గుంతలు తవ్వుతారు. మండలానికి ఒక పాఠశాలలో మూత్రశాలలు, ఒక సీసీ రోడ్డు, ఒక గ్రామ పంచాయతీ భవనం, ఒక అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్నారు.

పనుల విలువ ఇలా...

పశువుల దొడ్డి నిర్మాణానికి కూలీలకు రూ.16,677, సామగ్రికి రూ.76,442 మొత్తంగా రూ.93,119 ఖర్చు చేయనున్నారు. అజోలా పెంపకానికి కూలీలకు రూ.4,505, సామగ్రికి రూ.11,495, మొత్తం రూ.16,000 ఖర్చు చేస్తారు. వర్మీ, నాడెపు కంపోస్టు పిట్‌కు కూలీలకు రూ.2,536, సామగ్రికి రూ.12,781, మొత్తంగా రూ.15,317, కోళ్ల షెడ్ (వెయ్యి పిల్లలు) కూలీలకు రూ.50,728, సామగ్రికి రూ.2,48,857, మొత్తంగా రూ.2,99,585, భూఅభివృద్ధి పనులకు ఎకరాకు కూలీలకు రూ.43,200, సామగ్రికి రూ.1,800, మొత్తంగా రూ.45,000 ఖర్చు చేస్తారు. వ్యవసాయ బావుల వద్దకు రహదారుల నిర్మాణానికి 800 మీటర్లకు కూలీలకు రూ.7,69,444, సామగ్రికి రూ.1,32,911, మొత్తంగా రూ.9,02,355, తోటల పెంపకానికి ఎకారకు కూలీలకు రూ.48,189, సామగ్రికి రూ.13,965, మొత్తంగా రూ.62,154, చెక్ డ్యామ్ నిర్మాణానికి (15 మీటర్ల పొడవు) కూలీలకు రూ.21,969, సామగ్రికి రూ.4,78,031 మొత్తంగా రూ.5లక్షలు, ఫామ్ పాండ్స్ కూలీలకు రూ.2,93,152, సామగ్రికి రూ.6,251, మొత్తంగా రూ.2,99,403, భవనాలపై నుంచి వచ్చే నీటి ఇంకుడు గుంతకు కూలీలకు రూ.4,877, సామగ్రికి రూ.27,706, మొత్తంగా రూ.32,583, వ్యక్తి గత ఇంకుడు గుంతకు కూలీలకు రూ.1,038, సామగ్రికి రూ.5,781 వ్యయం చేయనున్నారు. ఈ పనులకు దరఖాస్తు చేసుకున్న వెంటనే విచారణ నిర్వహించి అర్హులైతే వెంటనే పనులు చేపడతారు. ఈ పనులను వచ్చే ఏడాది మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఈ అవకాశాన్ని ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నవారు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

మోతాదుకు మించి భాస్వరం వేయాలి

● ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య







మిర్యాలగూడ వ్యవసాయం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు సాగర్ ఆయకట్టులో రైతులు కొంతమంది యాసంగి వరి నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ముందుగా వరి కోతలు పూర్తయిన రైతులు నార్లు పోసుకుంటున్నారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున వరి నార్లు ఎర్రబడి, వాడిపోయే అవకాశం ఉంది. వరి నారు పెరుగుదల లోపిస్తుంది. వరి నాట్లు ఆలస్యమవుతున్నాయి. చలి తీవ్రతకు వరి నారులో కనిపించే లోపాలు ఏమిటి?, రైతులు ఎలాంటి యాజమాన్య పద్ధతుల చేపట్టాలో నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం, కంపసాగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా సంస్థ హెడ్, శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య సూచించారు.

నారు మడి యాజమాన్యం

● ఎకరం నారు మడికి రెండు క్వింటాళ్ల మాగిన కోళ్ల లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్‌ను వేసుకుని కలియదున్నాలి.

● చలి ఎక్కువగా ఉన్నందున భాస్వరాన్ని మోతాదుకు మించి వేసుకోవాలి.

● చలి సమస్యను అధికమించడానికి నారుమళ్లపై ఇనుప చువ్వలు, వెదురు కర్రలతో ఊతం ఇచ్చి పలుచని పాలిథిన్ కవర్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం వేళల్లో కప్పి ఉంచాలి. మరుసటి రోజు ఉదయం తీసి వేయాలి.

● రాత్రి ఉష్ణోగ్రత 12డిగ్రీల సెల్సియస్ కన్న తగ్గినపుడు నారు ఎర్రబడటంతోపాటు చనిపోతుంది.. జింకులోపం కనిపిస్తుంది.

● జింకు లోపం నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

● చలి తీవ్రత అధికంగా ఉన్నట్లయితే ఫార్ములా-4 వంటి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

● రాత్రివేళల్లో నారు మడిలో నీళ్ల నిండుగా ఉంచి తెల్లవారు జామున తీసి వేసి కొత్త నీళ్లు పెట్టాలి.

● కాండం తొలిచే పురుగు బారి నుంచి కాపాడుకునేందుకు నారు తీయడానికి వారం రోజుల ముందు ఎకరం నారుమడికి 800గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి.

నేటి నుంచి మూసీ నీటి విడుదల

● వారబంధీ పద్ధతిన నాలుగు విడతలుగా మూసీ నీటి విడుదలకు షెడ్యూల్ ఖరారు



కేతేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో యాసంగి సీజన్‌కు వారబంధీ పద్ధతిన ఈ నెల 18 నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉండడంతోపాటు ఎగువ నుంచి నిరాటంకంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో గతంలో మాదిరిగానే ఈ ఏడాది సైతం డిసెంబరు 18 నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆయకట్టులోని 35వేల ఎకరాల్లో ఆరుతడి పంటలకు సాగునీటిని అందించే లక్ష్యంతో నిర్మితమైన మూసీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు లభిస్తుండడంతో ఆయకట్టు రైతాంగం వానాకాలం, యాసంగి రెండు సీజన్లలోనూ వరి సాగుకు మళ్లింది. కాలక్రమేనా ప్రాజెక్టు ఆయకట్టు 33వేల ఎకరాలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో మూసీ అధికారులు వారబంధీ పద్ధతిన నీటి విడుదలకు షెడ్యూల్‌ను సిద్ధంచేసి ఇటీవల ఉన్నతాధికారుల అనుమతికి పంపించారు. ఈ షెడ్యూల్‌ను పరిశీలించిన నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు మూసీ ఆయకట్టులోని 33వేల ఎకరాలకు వారబంధీ పద్ధతిన నాలుగు విడతలుగా 115రోజులపాటు నీటి విడుదలకు అనుమతించడంతో మూసీ యంత్రాంగం ఈ నెల 18నుంచి 115రోజుల షెడ్యూల్‌తో ఆయకట్టులో ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు సమయత్తమైంది. 645అడుగుల (4.46టీఎంసీలు)పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 644.23అడుగుల (4.26టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఈ నీటితో ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు నాలుగు విడతలుగా 115రోజులపాటు(3.475టీఎంసీలు) సాగు నీటిని అందించాల్సి ఉంటుంది.

ఈ నెల 18నుంచి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగు నీటి విడుదల ఖాయమైంది. ఈ క్రమంలో ఆయకట్టుకు సాగునీటి విడుదలకు మూసీ అధికారులు రూపొందించినట్లు చెబుతున్న షెడ్యూల్ ఇలా ఉంది. మొదటి విడతగా ఈ నెల 18నుంచి వచ్చే ఏడాది జనవరి 11వరకు 25రోజుల పాటు (1.15టీఎంసీలు), 15రోజుల విరామం తర్వాత రెండో విడత నీటిని జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వరకు 15 రోజులపాటు (0.684టీఎంసీలు), 15 రోజుల విరామం తర్వాత ఫిబ్రవరి 26 నుంచి మార్చి 12 వరకు మూడో విడత నీటిని 15 రోజుల పాటు (0.699టీఎంసీలు), 15 రోజుల విరామం తర్వాత చివరిదైన నాలుగో విడత నీటిని మార్చి 27నుంచి పంట చేతికి వచ్చే వరకు (నీరు అందుబాటులో ఉన్నంత వరకు) (0.702టీఎంసీలు) మొత్తం 115 రోజులపాటు సాగునీటి విడుదల కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈ నెల 18నుంచి తొలి విడత నీటిని విడుదల చేసేందుకు మూసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిపాదిత నీటి విడుదల షెడ్యూల్ ?

సాగునీటి విడుదల షెడ్యూల్ ఇలా..

విడతలు	నీటి విడుదల	నిలుపుదల
మొదటి విడత	18-12-24 నుంచి 11-1-25	12-1-25 నుంచి 26-1-25
రెండో విడత	27-1-25 నుంచి 10-2-25	11-2-25 నుంచి 25-2-25
మూడో విడత	26-2-25 నుంచి 12-3-25	13-2-25 నుంచి 27-3-25
నాల్గో విడత	28-3-25 నుంచి ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నన్ని రోజులు	

ఆలస్యంగా వచ్చినందుకు దండన

● విద్యార్థినులను పైపుతో కొట్టిన 'ఆదర్శ' ప్రిన్సిపాల్ ● వలిగొండ మండలంలో ఘటన





గాయపడిన విద్యార్థినులు

వలిగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలోకి ఆలస్యంగా వచ్చిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పైపుతో కొట్టడంతో వారికి గాయాలయ్యాయి. ఈ నెల 12వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి నిలదీయటంతో ఈ సంఘటన వెలుగుచూసింది. విద్యార్థినుల తల్లిదండ్రుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వలిగొండ మండలం వర్కట్‌పల్లికి చెందిన అఖిల, నాతాళ్లగూడెంకు చెందిన అక్షిత లోతుకుంట ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలకు వచ్చిన వీరిద్దరూ రాగిజావ తాగేందుకు పాఠశాల ఆవరణలోకి వచ్చారు. వేడిగా ఉండటంతో విద్యార్థినులు తాగలేకపోయారు. కొద్దిసేపు ఆలస్యం కావడంతో తరగతి గదిలోకి చేరుకునే సందర్భంలో అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ రాయిసున్నీసాబేగం ఇంతసేపు ఆలస్యం ఎందుకు అయిందని ప్లాస్టిక్ పైపుతో తమ చేతులపై కొట్టారని విద్యార్థినులు ఆరోపించారు. ప్రిన్సిపాల్ కొట్టడంతో విద్యార్థినుల చేతులపై వాపు వచ్చింది. ఆ మరుసటి రోజు విద్యార్థినుల చేతులను పరిశీలించిన ప్రిన్సిపాల్ స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యుడితో కట్టు కట్టించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విద్యార్థినులకు గాయాలైన ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. పై విషయమై ప్రిన్సిపాల్ రాయిసున్నీసాబేగంను వివరణ కోరగా తాను విద్యార్థినులను కొట్టలేదని, కేవలం వారి ఆలస్యానికి కారణాన్ని అడిగి తెలుసుకుని మందలించినట్లు వివరించారు. ఈ ఘటనపై వలిగొండ ఎంఈవో భాస్కర్‌ను వివరణ కోరగా.. విద్యార్థులు, ప్రిన్సిపాల్ నుంచి సమాచారం సేకరించి జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదికను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థినుల చేతులు విరిగేలా కొట్టిన పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించి, ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్‌గౌడ్ మాట్లాడుతూ కొందరి తప్పిదాల వల్లే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక మౌలిక సౌకర్యాలు కల్పిందన్నారు.

యాదరుషి, భక్త ప్రహ్లాదకు ప్రత్యేక మండపాలు



(5వపేజీ తరువాయి)

ఆనవాయితీ. ఈ సంప్రదాయం ఏళ్లుగా ఉండగా, స్వామివారి చెంత గిరి ప్రదక్షిణ ఉంటుందనే విషయం ఇతర జిల్లాలు, రాష్ట్ర నుంచి వచ్చే భక్తులకు అవగాహన లేదు. దీంతో అరుణాచలం, సింహాచలం తరహాలో గుట్టలోనూ గిరిప్రదక్షిణను ఆలయ అధికారులు ప్రారంభించారు. సాధారణ భక్తులతోపాటు ఇటీవల అయ్యప్ప మాలధారులతో గిరి ప్రదక్షిణ చేయించారు. ఈ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో గిరి ప్రదక్షిణ భక్తులకు మార్గంలో ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. గుట్ట చుట్టూ 2.5కిలోమీటర్ల మేరకు భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. గిరిప్రదక్షిణ దారిలో సిమెంట్ ప్లేవర్స్ టైల్స్ ఏర్పాటుచేశారు. రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, గుట్ట చుట్టూ లైటింగ్, మౌలిక వసతులు కల్పించారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి గిరి ప్రదక్షిణ చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.




అందుబాటులోకి యాదరుషి, ప్రహ్లాదుడి మండపాలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి భక్తులు యాదరుషి, ప్రహ్లాదుడికి గిరిప్రదక్షిణ దారిలో ప్రత్యేకంగా మండపాలు నిర్మించాం. వీటిని త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నాం. ఈ నెల 26నస్వామివారి జన్మనక్షత్రం స్వాతిని పురుష్కరించుకుని యాదరుషి, భక్త ప్రహ్లాదుడి మండపాల్లో దర్శనాలు ప్రారంభిస్తాం. అదేవిధంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మౌలిక సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. గిరి ప్రదక్షిణ చేపట్టే భక్తులకు వసతులు కల్పించాం. దర్శనానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. స్వామివారి సన్నిధిలో వసతులతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

భాస్కర్‌రావు, ఆలయ ఈవో, యాదగిరిగుట్ట

శాలిగౌరారం మార్కెట్ చైర్మన్‌గా శంకర్‌రెడ్డి





పాదూరి శంకర్ రెడ్డి (చైర్మన్), నరిగే నర్సింహ (వైస్ చైర్మన్)

శాలిగౌరారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండమ జిల్లా శాలిగౌరారం వ్యవసాయం మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం సాయంత్రం జీవో 893ను జారీ చేసింది. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీటీసీ పాదూరి శంకర్ రెడ్డిని మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనిర్ నాయకులు నరిగే నర్సింహాను వైస్ చైర్మన్‌గా మరో 16మంది డైరెక్టర్లుగా నియమితులయ్యారు. డైరెక్టర్లుగా గైగుల్ల అవిలయ్య (ఇటుకలపహాడ్), కుతాటి సోమయ్య (శాలిగౌరారం), బండపల్లి అంజమ్మ - కొమరయ్య (తుడిమిడి), రాజుల శ్రీనివాస్ (మాదారం), దేవరకొండ జయరాజు (పెర్కకొండారం), తుక్కాని లక్ష్మీనర్సింహారెడ్డి (వల్లాల), షేక్ లతీఫ్ (జాలోని గూడెం), బోడ దానయ్య (అడ్లూర్), పడాల రమేష్ (తిరుమలరాయినిగూడెం), తాందారు సత్తయ్య (శాలిగౌరారం), బెలిదే రమేష్ (నకిరేకల్), తానం జోజిరెడ్డి (వంగమర్తి), తాల్లూరి మురళీ సింగిల్ విండో చైర్మన్ శాలిగౌరారం, జిల్లా మార్కెటింగ్ అధికారి నల్లగొండ వ్యవసాయ శాఖ ఏడి నకిరేకల్, స్పెషల్ ఆఫీసర్ శాలిగౌరారం గ్రామపంచాయతీ శాలిగౌరారం డైరక్టర్లుగా నియమితులయ్యారు. రెండు సంవత్సరాలు పాలకవర్గం కొనసాగనున్నది. 2019లో శాలిగౌరారం మార్కెట్ ఏర్పాటు నకిరేకల్ వ్యవసాయం మార్కెట్ పరిధిలో ఉన్న శాలిగౌరారం సబ్ మార్కెట్‌ను 2019 సంవత్సరంలో నూతనంగా శాలిగౌరార వ్యవసాయంమ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సారి మార్కెట్ కమిటీ చైర్మన్ జనరల్ మహిళకు రిజర్వ్ చేయడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కట్ట వెంకట్‌రెడ్డి సతీమణి కట్ట లక్ష్మి (అడ్లూర్) చైర్మన్ అయ్యారు. రెండవసారి చైర్మన్ పదవి ఎస్సీ మహిళలకు రిజర్వ్ చేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి సర్వయ్య కుమార్తె తేజస్వీని(మాదారం) చైర్మన్ అయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడవసారి చైర్మన్ పదవి జనరల్ రిజర్వు కావడంతో కోమటిరెడ్డి బ్రదర్స్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు అత్యంత దగ్గరగా ఉండే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన చిత్తలూరు గ్రామానికి చెంది పాదూరి శంకర్ రెడ్డి చైర్మన్ పదవి వరించింది.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భువనగిరి జిల్లా ఆసుపత్రి ఎదురుగా ఉన్న మాధవరెడ్డి పార్కులో మంగళవారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె అరుణ్‌కుమార్ తెలిపారు. మృతుడు సుమారు 70 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటాడు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	579.40
టీఎంసీలు	281.2784
ఎడమకాల్వకు నీటి విడుదల	7852
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	46,302 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.23అడుగులు
టీఎంసీలు	4.28
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	12.49క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	228.88 క్యూసెక్కులు

ఐసీఎంఆర్ గ్రాంట్‌కు ఎంపిక

నార్కట్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి కామినేని దంత వైద్య విద్య కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) గ్రాంట్‌కు ఎంపికయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థినులు వామిక, హసిత, విష్ణుప్రియ, షైనీ, రమ్య, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రోహిణి సంయుక్తంగా ప్రతిపాదించిన పరిశోధన అంశానికి గ్రాంట్ ఇచ్చేందుకు ఐసీఎంఆర్ ముందుకొచ్చింది. రీసెర్చ్ చేసే విద్యార్థులకు పరిశోధనకు అయ్యే గ్రాంట్ పొందుతున్న తొలి దంత కళాశాలగా కామినేని దంత వైద్య విద్య కళాశాల నిలిచిందని ప్రిన్సిపాల్ మహేశ్ తెలిపారు.

ఆసిఫ్‌నహర్‌పై ఏదీ.. నజర్

చిన్ననీటి వనరుల నిర్వహణపై సర్కారు చిన్నచూపు చూస్తోంది. వేల ఎకరాలకు సాగు నీరందించాల్సిన ఆసిఫ్‌నహర్ కాల్వ నిర్వహణ గాడి తప్పుతోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి ఎక్కడికక్కడే రైతులు సాగునీటిని మళ్లించుకుంటున్నారు. ఫలితంగా చివరి గ్రామాలకు కాల్వ నీరు చేరటం లేదు. దీంతో కాల్వ ఏర్పాటు లక్ష్యం నెరవేరటంలేదు. నల్లగొండ జిల్లాకు వరప్రదాయిని అయిన మూసీ నది ప్రక్షాళన, శుద్ధీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ఆ దిశగా చకచకా అడుగులు వేస్తోంది. అదే మూసీ నది నీటితో ముడిపడి ఉన్న ఆసిఫ్‌నహర్ కాల్వ నిర్వహణపై మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)





దెబ్బతిన్న షట్టర్, కత్వకు షట్టర్లు లేకపోవడంతో ఈదులూరు చెరువుకు పారుతున్న నీరు

- గాడి తప్పుతున్న కాల్వ నిర్వహణ
- పలు చోట్ల ధ్వంసమైన కాల్వల షట్టర్లు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నెమలికాల్వ వద్ద ప్రారంభమయ్యే ఆసిఫ్‌నహర్ మూసీ కాల్వ నిడివి సుమారు 103 కిలోమీటర్లు ఉంది. నిజాం కాలంలో నెమలికాల్వ అనే గ్రామం వద్ద ప్రారంభమైన ఈ కాల్వ రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నల్లగొండ మండలాల్లోని కొన్ని గ్రామాల మీదుగా వెళ్లి ఇంతకు ముందు నల్లగొండ పానగల్ చెరువులో కలిసేది. కానీ పానగల్ చెరువుకు కృష్ణానీటిని తరలించి తాగునీటి పథకంగా మార్చిన తర్వాత ఆసిఫ్‌నహర్ మూసీ కాల్వ నీటిని కట్టంగూరు మండలం వద్దే మళ్లించి వాగులోకి కలిపారు. కాల్వ ఏర్పాటు చేసిన ఆనాడు 15,245 ఎకరాల ఆయకట్టుగా స్థిరీకరించారు. కానీ ప్రస్తుతం ఆయకట్టు సుమారు 35వేల ఎకరాలకు పెరిగినట్టు అంచనా.

పదేళ్లుగా నిర్వహణ నిధులు కరువు

పదేళ్ల కాలంలో ఆసిఫ్‌నహర్ కాల్వ నిర్వహణకు నిధులు మంజూరు కాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల మరమ్మతులు, పూడికతీత చేపట్టినా అసిఫ్‌నెహర్ కాల్వపై మాత్రం దృష్టి పెట్టలేదు. దీంతో కాల్వ నిర్వహణ గాడి తప్పింది.

పూడిక పేరుకుపోయి కాల్వలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల గుర్రపుడెక్క రైతులకు అశనిపాతంలా పరిణమించి సాగునీటికి ఇబ్బందులు పడేలా చేసింది. దీంతో కొన్ని గ్రామాల్లో రైతులే స్వచ్ఛందంగా రాజకీయ నాయకుల సహకారంతో గుర్రపు డెక్కను తొలగించడం, తూములను సరి చేసుకోవడం వంటి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు.





చిప్పలపల్లి వద్ద కాల్వలో మోటార్లు వేసుకున్న రైతులు, తుప్పుపట్టిన తూము

రూ.7 కోట్లతో ప్రతిపాదనలు?

పదేళ్లుగా నిరాదరణకు గురైన ఆసిఫ్‌నహర్ కాల్వ మరమ్మతుల కోసం ఎమ్మెల్యే వేముల వీరేశం సూచన మేరకు చిన్ననీటి వనరుల శాఖ అధికారులు సుమారు రూ.7కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు సమాచారం. ఈ నిధులతో 103 కిలోమీటర్ల మేర ఉన్న ఆసిఫ్‌నహర్ కాల్వ బలోపేతానికి మరమ్మతులు, ప్రకృతి వైపరీత్యాలకు తోడు గుర్తుతెలియని రైతుల చర్యలతో దెబ్బతిన్న కత్వల నిర్మాణం, షట్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. అయితే ఈ ప్రతిపాదనలు ఇంకా ప్రభుత్వానికి చేరి పరిపాలనా అనుమతులు వస్తే డీటెయిల్డ్ ఎస్టిమేషన్ వేసేందుకు సంబంధిత అధికారులు ఎదురుచూస్తున్నట్లు తెలిసింది.

ధ్వంసమైన అక్కెనపల్లి కత్వ షట్టర్లు

ఆసిఫ్‌నహర్ కాల్వపై నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి పెద్దచెరువుకు మూసీ నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కత్వ దెబ్బతిన్నది. మూడు ఖానాలతో ఏర్పాటు చేసిన కత్వ షట్టర్లను గుర్తు తెలియని రైతులు ధ్వంసం చేశారు. ఇదే కాల్వకు కొద్దిదూరంలో చిప్పలపల్లి గ్రామ సమీపంలో ఈదులూరుకు మళ్లించే కాల్వకు ఉన్న షట్టర్లను కూడా ధ్వంసం చేశారు. దీంతో ఈ రెండు కత్వల వద్ద షట్టర్లు లేకపోవడంతో నీరంతా అక్కెనపల్లి, ఈదులూరు గ్రామాల చెరువులకే వెళ్తోంది. దీంతో చిప్పలపల్లితోపాటు ఆ గ్రామం మీదుగా తొండ్లాయి, శాపల్లి, పరడ తదితర చెరువులకు మూసీ నీరు రావడం లేదు. పొలాలకు నీటిని అందించే తూములు మరమ్మతులకు లోనవడంతో రైతులు కాల్వలో మోటార్లు వేసుకుని నేరుగా పొలాలకు నీరు తరలిస్తున్న కారణంగా చివరి గ్రామాలకు సాగునీరందక ఆయకట్టు లక్ష్యం నెరవేరటం లేదు.

కత్వ షట్టర్లను పునరుద్ధరించాలి



ఆసిఫ్‌నహర్ కాల్వ నుంచి మూసీ నీటిని అక్కెనపల్లి పెద్ద చెరువుకు తరలించేందుకు కట్టిన కత్వ షట్టర్లను పునరుద్ధరించాలి. షట్టర్లు ధ్వంసం కావడంతో ఎగువనుంచి వచ్చే నీరంతా దిగువ గ్రామాల చెరువులకు బదులు మొత్తం అక్కెనపల్లి చెరువులోకి చేరుతోంది. దీంతో మేము ఎండాకాలంలో సాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే షట్టర్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి.

- పనస ధనుంజయ్య, రైతు,చిప్పలపల్లి

నీరు రాకుంటే బోర్లు ఎండిపోతున్నాయి



ఆసిఫ్‌నహర్ నీరు రాకుంటే మా వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. అక్కెనపల్లి, ఈ దులూరు కత్వలకు ఉన్న షట్టర్లను ఎవరో ధ్వంసం చేయగా వాటిని నేటికీ పునరుద్ధరించలేదు. దీంతో సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. ఎమ్మెల్యే చొరవ తీసుకుని కాల్వకు మరమ్మతులు చేయించాలి. ఆయకట్టు చివరి గ్రామం వరకూ సాగునీరందేలా చర్యలు తీసుకోవాలి.

- బత్తిని రాంబాబు, రైతు, చిప్పలపల్లి

కత్వ షట్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఆసిఫ్‌నహర్ కాల్వ ద్వారా నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి చెరువుకు మూసీ నీటినందించే కత్వ షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అత్యంత ప్రాధాన్యంగా గుర్తించి వీటి పునరుద్ధరణకు సుమారు రూ.5లక్షలతో అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపుతాం. మంజూరు రాగానే టెండర్‌ప్రక్రియ నిర్వహించి పనులు చేయిస్తాం.

- శరత్‌చంద్ర, జేఈఈ



పోటీలకు వెళితే..

పతకమే..

జాతీయ స్థాయిలో రాణిస్తున్న చిలుకూరు యువకుడు




పోటీల్లో భాగంగా బరువు ఎత్తుతున్న యడవెల్లి యశ్వంత్

ఆటలపై ఆసక్తితో చిన్న వయసు నుండే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ జాతీయ స్థాయి లో రాణిస్తున్నాడు యడవెల్లి యశ్వంత్. సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామానికి చెందిన యశ్వంత్‌కు చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి ఉండడాన్ని గమనించిన తండ్రి పుల్లారావు కుమారుడిని ప్రోత్సహించాడు. 2013వ సంవత్సరంలో రాష్ట్ర స్థాయి ఎంపికల్లో భాగంగా సికింద్రాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలలో యశ్వంత్ 4వ తరగతిలో ప్రవేశం పొందాడు. ఆనాటి నుండి చదువుతో పాటు క్రీడా పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు.

- (ఆంధ్రజ్యోతి,చిలుకూరు)

2015లో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 50కిలోల విభాగంలో 3వ స్థానంలో నిలిచి కంచు పతకం గెలుచుకున్నాడు. ● 2017లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ● 2018 నవంబరులో అస్సాంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఖేల్ ఇండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. ● 2021 డిసెంబరులో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. 2022లో భువనేశ్వర్‌లో జరిగిన 96 కిలోల విభాగంలో నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని మొదటి 10మందిలో ఒకడిగా నిలిచాడు.● 2024 జనవరి 2న తమిళనాడులో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ విభాగంలో 102 కేజీల విభాగంలో 4వ స్థానం సాధించి ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌కు యశ్వంత్ ఎంపికయ్యాడు.● డిగ్రీ చదువుతున్న యశ్వంత్ చిన్ననాటి నుండి 15 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాడు.

చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి



నా కుమారుడు యశ్వంత్‌కు చిన్నప్పటి నుంచే క్రీడలంటే అమితమైన ఆసక్తి. క్రీడల్లో రాణించాలనే ఆసక్తితో హకీంపేట క్రీడా పాఠశాలలో చేర్పించాం. చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జాతీయస్థాయిలో రాణించడం సంతోషంగా ఉంది.

యడవెల్లి పుల్లారావు, యశ్వంత్ తండ్రి

విభజన రాజకీయాలను తిప్పికొట్టాలి

సీపీఎం నేతలు జూలకంటి, సుదర్శన్

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలను తిప్పికొడుతూ ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలు మంగళవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ప్రతినిధుల సభలో వారు మాట్లాడుతూ, దేశంలో కుల, మత, వర్గ వైషమ్యాలను రెచ్చగొడుతూ బీజేపీ రాజకీయ లబ్ధి పొందేందుకు రకరకాల కుట్రలు చేస్తోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం తప్ప ఇతర ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ప్రయాణికులకు తగినట్టుగా బస్సులను పెంచాలని, రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను సాగించాలని, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బి.అనురాధ, పి.ఆశయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, పాండు, మేక అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎడీ.పాషా, బండారు నర్సింహ, కౌన్సిలర్లు జి.లక్ష్మణ్, దండ అరుణ్‌కుమార్, మండల, పట్టణ కార్యదర్శులు గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య, దాసు, కొంతం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలి

65వ నంబరు జాతీయ రహదారికి ఉత్తర భాగంలోని ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్ రోడ్డు) నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారంగా పరిహారం చెల్లించాలని సభలో తీర్మానించారు. జిల్లా మహాసభల్లో పలు తీర్మానాలను ఆమోదించారు. కాలుష్య జలాలతో వ్యవసాయ రంగంతో పాటు కుల వృత్తులకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్న మూసీని ప్రక్షాళనచేసి గోదావరిజలాలు పారించేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించాలని, రాచకొండ అటవీ భూములను పరిరక్షించాలని, ఏళ్ల తరబడిగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు పట్టాలను అందజేయాలని తీర్మానించారు. చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలతో పాటు భువనగిరిలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షన్ భిక్ష కాదని.. అది ఉద్యోగుల హక్కు అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ ఉద్యోగుల హక్కని.. అది ప్రభుత్వ భిక్ష కాదని 1982లో సుప్రీంకోర్టు డిసెంబరు 17న తీర్పు చెప్పడం చరిత్రాత్మకమన్నారు. ప్రపంచ బ్యాంకు అనుసరణలో నూతన ఆర్థిక సంస్కరణల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని దేశవ్యాప్తంగా 2004సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో 2004సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీ నుంచి రద్దుచేసి దాని స్థానంలో నూతన పెన్షన్ విధానం (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) అమలులోకి తీసుకొచ్చారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని, ప్రతి ఏడాది సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా ధర్నాలు, దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెన్షన్ పొందే హక్కు కోసం పోరాడిన డీఎస్.నకారా చిత్రపటానికి పెన్షనర్ల సంఘం సీనియర్ నాయకుడు పాదూరి విద్యాసాగర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్‌చంద్ర, తెలంగాణ బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి, టాప్రా రాష్ట్ర మాజీ కార్యదర్శి కె.సత్తిరెడ్డి, కుకుడాల గోవర్ధన్, ఎండి.అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, యానాల కృష్ణారెడ్డి, కౌసల్య సీహెచ్ భిక్షమయ్య, పులి కృష్ణమూర్తి, గుండాల భిక్షమయ్య, బంగారయ్య, సత్యనారాయణరావు, పి.రమణారెడ్డి, సత్యనారాయణ, సావిత్రి, రబియాబేగం పాల్గొన్నారు.



పెన్షనర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, రాజాపేట మండలంలోని మేజర్ గ్రామంగా ఉన్న రఘునాథపురాన్ని మండల కేంద్రంగా చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రంలో 42డివిజన్‌లు ఉండగా అప్పటి ప్రభుత్వం వాటిని 76కు పెంచిందన్నారు. ఎన్నికల సందర్భంగా హడావిడిగా ప్రకటించడంతో అందరికీ ఉపయోగపడే విధంగా రెవెన్యూ గ్రామాల ప్రకటన జరగలేదన్నారు. ఆ ప్రకటన శాస్త్రీయంగా లేదని ప్రజలకు, రైతులకు వాటితో న్యాయం జరగడం లేదన్నారు. రెవెన్యూ డివిజన్లను వాటి విస్తీర్ణం జనాభా ప్రతిపాదికన చేయాల్సి ఉండగా అవేవీ పాటించలేదన్నారు. మోటకొండూరుకు సమీపంలో ఉన్న నాలుగు గ్రామాలను కలపకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆలేరును 8 మండలాలతో కూడిన రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు. 30కిలోమీటర్ల దూరంలో ఉన్న డివిజన్ కేంద్రానికి వెళ్లడం ప్రజలకు ఇబ్బందికరమన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా రఘునాధపురాన్ని మండలంగా ప్రకటించేలా సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి దృష్టి సారించాలని కోరారు.

'తుంగతుర్తి'కి ప్రత్యేక నిధులు ఇవ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే మందుల సామేలు ప్రస్తావన



మోత్కూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన, ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైన 'తుంగతుర్తి' అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మోత్కూరు మండలాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని తాను అందరికంటే ముందుగానే రెవెన్యూ శాఖ మంత్రికి లేఖ ఇచ్చానని, రెవెన్యూ శాఖ మంత్రి చదివిన జాబితాలో మోత్కూరు లేదన్నారు. రెవెన్యూ డివిజన్ల జాబితాలో మోత్కూరును చేర్చాలని మంత్రిని కోరారు. మోత్కూరులో ఆర్టీసీ బస్సుడిపో ఏర్పాటు చేయాలని తాను రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరగా ఆయన అంగీకరించారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మోత్కూరు ప్రాంతానికి ఏటా 70కిలోమీటర్ల పరిధిలో బస్సు డిపో లేనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, త్వరగా బస్సు డిపో ఏర్పాటు అయ్యేలా చూడాలని కోరారు. మోత్కూరులో రోడ్డు నిర్మాణం చేయకుండానే డివైడర్ నిర్మించారని, దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది జరుగుతోందన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న మునిసిపాలిటీలను ప్రభుత్వమే చక్కదిద్దాలన్నారు. తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి పిల్లర్లు వేసి వదిలేశారని, దాన్ని పూర్తి చేయడంతో పాటు మోత్కూరులో 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని ఆయన కోరారు.

అసెంబ్లీలో 'అమ్మనబోలు'పై చర్చ

నార్కట్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రతిపాదిత కొత్త మండలంగా అమ్మనబోలు ఏర్పాటు కోసం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీ సమావేశాల వేదికగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో అవసరాన్ని బట్టి కొత్త రెవెన్యూ డివిజన్లు, మున్సిపాలిటీలు, మండలాల ఏర్పాటుపై మంత్రులు ఇతర ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి అసెంబ్లీ సమావేశాల్లోనే స్పందించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం కోరిన కొత్త మండల ఏర్పాటు ఆవశ్యకత అవసరం, అవకాశాల గురించి సంబంధిత అధికారుల ద్వారా సమాచారం తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అనన్యం ప్రతిభ

- భరతనాట్యంలో రాణిస్తున్న చిన్నారి
- పాత నాణేల సేకరణ,చిత్రకళలో దిట్ట



(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్): చిన్నారులు చిచ్చర పిడుగులంటారు. అదే కోవకు చెందిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన చెరుపల్లి కరుణాకర్, ఉష దంపతుల చిన్న కుమార్తె అనన్యప్రియ చదువుతో పాటు డ్రాయింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తోంది. పాత నాణేలు, కరెన్సీ సేకరణలోనూ, సంప్రదాయ నృత్యంలోనూ ప్రతిభ కనబరుస్తోంది. సంస్కృతి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అనన్య తన తండ్రి వేసే డ్రాయింగ్ చూసి ఆసక్తి పెంచుకుంది. కుమార్తె ఇష్టాన్ని గుర్తించిన తల్లిదండ్రులు నాణేల ప్రదర్శనలకు తీసుకెళ్లేవారు. ఆన్‌లైన్‌లో నాణేలను కొనుగోలు చేసేందుకు సహకరిస్తున్నారు. చదువుతోపాటు అనన్య నాణేల సేకరణ కూడా హాబీగా మారింది. పాత నాణేలు, పలు దేశాలకు చెందిన కరెన్సీ సేకరించి భద్రపరుస్తోంది. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలలోనూ ప్రదర్శనలిస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

మరిన్ని సేకరిస్తా

నాణేల సేకరణ అంటే నాకు ఇష్టం. ఈ మధ్యకాలంలో కరెన్సీ నోట్లు కూడా సేకరిస్తున్నా. స్కూల్, ట్యూషన్‌లకు వెళ్తూనే డ్రాయింగ్, డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నాను. ఇందుకు అమ్మ నాన్న సహకరిస్తున్నారు. - అనన్యప్రియ

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణు పుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేద మంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగ వల్లీ దళార్చనలు చేపట్టారు. ఆంజనేయ స్వామికి వడలు, బూరెలు, బెల్లం పానకం, వడపప్పు, అరటిపండ్లు నివేదించి వితరణ చేశారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్టలోనూ ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామ లింగేశ్వరస్వామికి, ముఖ మండపంలో నిస్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ధనుర్మా సోత్సవాల్లో భాగంగా ముఖ మండపంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్ది వేదికపై అధిష్ఠింపజేశారు. మహిళా భక్తులు పాల్గొని, హారతి నివేదించగా పొంగలి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

పీఏసీఎస్‌లో అందుబాటులోకి ఫోన్‌పే సేవలు

చిట్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లో రైతులు నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసేందుకు ఫోన్‌పే సేవలు అందుబాటులోకి వచ్చాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి కోరారు. చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్‌లో మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. పీఏసీఎస్‌లలో ఆర్థిక లావాదేవీలను ఎప్పటి నుండో నగదు ద్వారానే జరుగుతోందని, ఈ ఏడాది ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బొంతల అంజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు పిశాటి భీష్మారెడ్డి, గడ్డం సత్తిరెడ్డి, టేకుట కవితాఅంజిరెడ్డి, ఏదుళ్ళ అజిత్‌రెడ్డి, మామిడి శ్రీరాములు, బోయపల్లి స్వామి, మేడి అచ్చమ్మ, మురాల గోపయ్య, గంగాపురం భాస్కర్, సీఈవో రాజిరెడ్డి పాల్గొన్నారు.

డీలర్‌పై కేసు నమోదు

కట్టంగూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇతరులకు విక్రయించిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసి క్రిమినల్ కేసు పెట్టినట్లు సివిల్ సప్లయ్ అధికారి ఆర్. జ్యోతి తెలిపారు. కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లోని రేషన్ షాపును మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీలో 69.62కిలోల రేషన్ బియ్యం ఇతరులకు విక్రయించినట్లు తేలిందన్నారు. డీలర్ మాతంగి శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఉర్మిల ఉన్నారు.

గ్రంథాలయం.. అక్షర జ్ఞానం

● జడ్పీ స్టడీ సెంటర్, జిల్లా గ్రంథాలయంతో పెరిగిన ప్రయోజనం ● అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా మారాయి. జిల్లా పరిషత్ స్టడీ సెంటర్‌తో పాటు జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రయోజనకరంగా మారాయి. ఈ రెండు గ్రంథాలయాల్లో పాఠకులకు అనేక పత్రికలు అందుబాటులో ఉన్నాయి. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు నల్లగొండ పట్టణంలో రవీంద్రనగర్‌లో మహిళల, పిల్లల గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లాకేంద్రంలో గ్రంథాలయానికి ప్రతిరోజూ 350మంది నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం పుస్తకాలను చదువుకోవడానికి వస్తున్నారు. చాలామంది గ్రంథాలయంలోని పుస్తకాలు తీసుకుని చదువుతుండగా, మరికొంత మంది సొంత పుస్తకాలు తెచ్చుకొని చదువుతున్నారు. ఈ గ్రంథాలయంలో పాఠకుల కోసం ప్రత్యేకంగా మూడు విభాగాలు పనిచేస్తున్నాయి. పేపర్ విభాగం, రీడింగ్ విభాగం, పుస్తకాల విభాగాలు ఉన్నాయి.



గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు

గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించి..

జిల్లాకేంద్ర గ్రంథాలయంలో కొన్ని సంవత్సరాల నుంచి పోటీ పరీక్షల కోసం పలువురు నిరుద్యోగులు ప్రతినిత్యం పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతున్నారు. గ్రూప్ 1,2,3,4లకు సంబంధించిన వివిధ రకాల 73వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, సంస్కృతం భాషల్లో అందుబాటులో ఉంచారు. డీఎస్సీ, కానిస్టేబుల్, రైల్వే, గురుకుల, టెట్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలన్నింటిని నిరుద్యోగులకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు 18 మంది గురుకుల ఉపాధ్యాయులుగా, డీఎస్సీలో 38 మంది, గ్రూప్-4లో ఆరుగురు, లెక్చరర్లు 4, కానిస్టేబుల్ 32మంది, ఆరుగురు ఎస్ఐలు ఉద్యోగాలు సాధించారు. అదేవిధంగా మహిళా ప్రాంగణంలో అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ప్రస్తుత జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డిలు ప్రత్యేకంగా జడ్పీ స్టడీ సెంటర్‌ను నూతన ప్రభుత్వ భవనంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిరోజూ 100మంది వరకు పాఠకులు, నిరుద్యోగులు, యువకులు స్టడీ సెంటర్‌లో చదువుకుంటారు. కలెక్టర్ నిధుల ద్వారా జడ్పీ స్టడీ సెంటర్‌లో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. జిల్లా గ్రంథాల యంలో కూడా మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంది. జడ్పీ స్టడీ సెంట ర్‌లో అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నారు. ఇటీవలనే 15మంది వరకు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

నూతన గ్రంథాలయానికి శ్రీకారం

జిల్లాకేంద్ర గ్రంథాలయాన్ని 1957సంవత్సరంలో ప్రారంభించారు. అప్పటినుంచి కొన్ని వసతుల కల్పనతో కొనసాగుతూ వస్తోంది. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రంథాలయాన్ని ఆధునికరించాలన్నా ఉద్దేశంతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో పట్టణంలోని టౌన్‌హాల్ స్థలంలో రూ.10కోట్లతో జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భవనంలో పుస్తక ,రీడింగు ,పిల్లల విభాగంతో పాటు సెమినార్ హాల్, పార్కింగ్, క్యాటరింగ్ అప్డేట్ పుస్తకాలు, భోజన వసతి వంటి వసతులు కల్పించనున్నారు. మూడు ఫ్లోర్‌లతో సెల్లార్ నిర్మిస్తున్నారు.

అనేక మందికి ఉద్యోగాలు వచ్చాయి



జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జడ్పీ స్టడీ సెంటర్‌లో చదువుకున్న అనేకమందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. మహిళా ప్రాంగణంలోని ప్రభుత్వ భవనంలో ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌లో 100 మందికి పైగా చదువుకుంటున్నారు. పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉన్నాయి.

● ఎన్. ప్రేమ్ కరణ్‌రెడ్డి, జడ్పీ సీఈవో

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



జిల్లాకేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి సహకారంతో పాఠకులకు, నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరేలా అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాం. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నాం.

● బి. బాలమ్మ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

సర్వే రెమ్యూనరేషన్ ఇవ్వాలి

మర్రిగూడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్స్‌కు రెమ్యూనరేషన్‌ను వారి అకౌంట్‌లో వెంటనే జమ చేయాలని ట్రైబల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరాం, జిల్లా అధ్యక్షుడు కేతావత్ శ్రీరాం, మండల అధ్యక్షుడు రమావత్ విఠల్ కోరారు. తహసీల్దార్‌కు మంగళవారం వినతి అందజేశారు. రెండు, మూడు రోజుల్లో ఎనుమరేటర్స్ అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

తిరుప్పావై ప్రబంధ పారాయణం

చిట్యాలరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై ప్రబంధ పారాయణం చేశారు. 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల పూజల సందర్భంగా భక్తులు దేవాలయంలో భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

దీర్ఘకాలిక సెలవుపై ఎంపీడీవో

శాలిగౌరారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు ఎంపీవో పద్మ తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఇంకా ఎవరినీ నియమించలేదని తెలిపారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే

నల్లగొండ క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ అధికారుల కార్యాలయంలో ఉన్న జిల్లా విశ్రాంత పోలీస్ కార్యాలయంలో ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విశ్రాంత పోలీస్ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోలి లక్ష్మారెడ్డి, గౌరవా ధ్యక్షుడు డేవిడ్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేసి రిటైర్ట్ అయిన పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి సంఘం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జానరల్ సెక్రటరీ మహ్మద్ హసన్‌అలీ, జాయింట్ సెక్రటరీ శంకరయ్య ఉన్నారు.

పాత భవన సముదాయం కూల్చివేత

కనగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన జూనియర్ కళాశాల నిర్మాణంలో భాగంగా ఆధ్వర్యంలో అధికారులు ఎస్ఎల్‌బీసీ పాత భవనాలను మంగళవారం తొలగించారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు వారంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు చోట్ల ప్రభుత్వ స్థలాలను పరిశీలించి ఎస్ఎల్‌బీసీ క్వాటర్స్ స్థలాన్ని కళాశాల భవనం నిర్మాణానికి ఎంపిక చేసారని తెలిపారు. అందులో భాగంగానే పాతక్వాటర్స్ భవ నాలను తొలగించి, ఎస్ఎల్‌బీసీ స్థలాన్ని చదును చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఆర్‌అండ్‌బీ జేఈ అనిత నాయకులు నర్సింగ్ క్రిష్ణయగౌడ్, పెద్దులు, ఉన్నారు.

మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలి

కనగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మంగళవారం నాలుగో రోజుకు చేరింది. 010 పద్దు కింద వేతనాల చెల్లించాలన్నారు. నోషనల్ సర్వీస్, హెల్త్‌కార్డులు, కారుణ్య నియామకాలు, పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ థామసయ్య, ఉపాధ్యాయులు భద్రయ్య, శ్రీనివాస్, రాజేందర్, రామక్రిష్ణ, వరలక్ష్మి, రాధిక, శ్రీనివాస్‌గౌడ్, అర్షబేగం, అనితారాణి, అనిత, జానీబేగం, రాజు, విజయ్ ఉన్నారు.

మాలలకు అన్యాయం చేయొద్దు

నల్లగొండ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాలలు శ్రమించారని, మాలలకు అన్యాయం చేయొద్దని మాల మహానాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేకల సైదులు అన్నారు. సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మాల, మాదిగలను విభజించి పాలించాలని చూస్తున్న బీజేపీ చేస్తున్న కుట్ర అని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. మాదిగ కులస్థులు బీజేపీకి ఓటేయాలని మంద కృష్ణ ఎజెండాలో తీర్మానం పెట్టారని, అదే మాలలు ఏ పార్టీకి ఓటేయాలని ఎజెండా పెట్టలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. సమావేశంలో మేకల కృష్ణయ్య, రువ్వా యాదగిరి, సైదులు, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

నల్లగొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నల్లగొండ ప్రీమియం లీగ్ సీజన్-5 క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం 9 జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ నెల 20వ తేదీన క్రికెట్ టోర్నమెంట్ ముగియనుంది. టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి బహుమతి రూ.2లక్షల116 నగదు, ద్వితీయ బహుమతిగా రూ.1లక్ష116 నగదు అందజేయనున్నారు. సోమవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లను మునిసిపల్ వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ బోనగిరి ప్రభాకర్, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, ప్రదీప్ నాయక్, నాగేశ్వర్‌రావు, మోహన్ బాబు, శేఖర్ రెడ్డి, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన వనరులు పొదుపుగా వాడాలి

కనగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంధన వనరులను పొదుపుగా వినియోగించాలని పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎం. పాండురంగారావు కోరారు. ఇంధన వనరుల పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చినమాదారం గ్రామ హైస్కూల్‌లో విద్యారుథలకు మంగళవారం అవగాహన కల్పించారు. అదేవిధంగా 'సోలార్ ఎనర్జీ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, హిందూరాణి, సరిత, మదుసూదన్, శశిరేఖ, నరేందర్‌రెడ్డి, ఉమామహేశ్వరి తదితరులున్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

కేతేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని డీసీఎంఎస్ ఛైర్మన్ బోళ్ళ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని భీమారం గ్రామంలో గల క్రీస్తు మహిమ చర్చిలో సోమవారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు ప్రార్థనలు, ఆధ్యాత్మిక బోధనలు మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ డైరెక్టర్ కె.సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసయాదవ్, చర్చి పాస్టర్ జి. జానయ్య, నాయకులు అంజన్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నార్కట్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైంది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కెనపల్లికి చెందిన బాకి అనూష అనే యువతి కాకతీయ యూనివర్శిటీలో పీజీ చదువుతోంది. పరీక్షల కోసం ఇంటికి వచ్చిన యువతి మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. ఆమె మొబైల్ నెంబర్‌కు కాల్ చేసినా స్విచాఫ్ వచ్చింది. దీంతో బంధువులు, తెలిసిన వారింటికి వెళ్లిందేమోనని ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. తన సోదరి అదృశ్యమైదని సోదరుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హనుమాన్ యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వాలి

నార్కట్‌పల్లి, నల్లగొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని మజీదు ఎదురుగా ఉన్న అంగడి స్థలంలో హనుమాన్ గాయత్రీ యజ్ఞం నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఎస్పీ శరత్ చంద్రపవార్‌లకు మంగళవారం వినతిప త్రాలు అందజేశారు. గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ కంఠం స్థలంలో 50ఏళ్లకు పైగా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్ని సామాజిక వర్గాల కార్యక్రమాలకు వేదికగా నిర్వహించారన్నారు. ప్రస్తుతం ఇదే స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే కూరగాయల సంత నిర్వహిస్తున్నారని గతంలో పశువుల సంత కూడా నిర్వహించిన విషయాన్ని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, నాయకులు కొర్వి శంకర్, మేడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, రామలింగం, కన్నెబోయిన నర్సింహ, నడింపల్లి శ్రవణ్‌కుమార్ ఉన్నారు. నార్కట్‌పల్లిలోని అంగడి స్థలంలో హనుమాన్ గాయత్రీ యజ్ఞం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వకపోవడానికి నిరసనగా, హనుమాన్ స్వాములకు సంఘీబావంగా నార్కట్‌పల్లిలోని స్థానిక వ్యాపారులు మధ్యాహ్నం దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ చేసి మద్దతు తెలిపారు.



నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : జడ్పీ సీఈవో

● జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి



సీఎం కప్ పోటీల్లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని జడ్పీ సీఈవో నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మేకల అభినవ స్టేడియంలో మంగళవారం రెండో రోజు ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పోటీల ద్వారానే విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొనే విధంగా ప్రతిభ నిరూపించుకోవాలన్నారు. శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఆనందం కూడా క్రీడల వల్ల కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఇందిరా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరత్నం, సురేందర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, విజయ్, నాగరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

మర్రిగూడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌కు వెళ్తున్న కార్మికులను పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోలేపల్లి రాములు, సిలివేరు మహేష్, ఆవుల ముత్తయ్య, గ్యార యాదగిరి, ఉరుపక్క నరసింహ, ఉరుపక్క బిక్షమయ్య, యాచారం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి, (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆదిమళ్ళ సుధీర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ సమావేశానికి హాజరుకాకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు గండమళ్ళ ఆశీర్వాదం, నాయకులు ఏడాకుల కోటయ్య, ఎం.సైదులు, వెంకటాచారి, జ్యోతి, నాగమణి, మహేష్, కళ్యాణ్, రాజు, సైదులు, అమృతయ్య తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): జీపీ కార్మిక సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నరుకుడపిండెల నర్సింహ, షకీల్, వెంకన్న, ఎల్లయ్య, శ్రీనివాస్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.



కేతేపల్లి పోలీసుల అదుపులో ఉన్న సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు

చిట్యాల,(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య తదితరులున్నారు.

శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు వెళ్తున్న కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశాఉ. అరెస్టు అయిన వారిలో మండల నాయకులు బట్ట చిన సైదులు, రాచకొండ గణేష్, తాటిపాముల హేమాద్రి, వాడపెల్లి జగన్, బట్ట మోహన్, సైదులు, బట్ట గణేష్, బట్ట కిరణ్, గండమల్ల రాజు, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలి

రామగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సయ్యద్ ముసాబ్ అహ్మద్ సర్వే సిబ్బందికి సూచించారు. పట్టణంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడంలో చిన్న పొరపాటు కూడా జరగకూడదన్నారు. ఈ క్రమంలో వార్డు ప్రజలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అవట్‌డోర్ స్టేడియంలో జరుగుతున్న సిఎం కప్ క్రీడా పోటీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వే సిబ్బంది కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

చండూరు రూరల్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలంలోని నెర్మట గ్రామంలో మంగళవారం జరిగిన పార్టీ గ్రామసభలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, ఈరటి వెంకన్న, అంతిరెడ్డి, బెల్లం స్వామి, ఈరటి వెంకన్న, గుయ్యని పండు, లక్ష్మమ్మ, లింగమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

బలహీన వర్గాలపై ప్రభుత్వ దమనకాండ ఆపాలి

నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత గిరిజన, బడుగు, బలహీన వర్గాలపై దమనకాండ పెరిగిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, బడుగు, బలహీనవర్గాలపై ప్రభుత్వ లగచర్ల ఘటనపై ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం డీఈవో కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత, బడుగు, బలహీన వర్గాలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో నిర్బంధిస్తోందన్నారు. లగచర్లలో ఫార్మాసిటీ కోసం రైతుల భూములు లాక్కున్నారని నిరసన వ్యక్తం చేసిన రైతులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక రాష్ట్ర అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు కటికం సత్తయ్యగౌడ్, మార్కెట్ మాజీ ఛైర్మన్ బొర్ర సుధాకర్, మాజీ ఆర్వో మాలే శరణ్యారెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మందడి సైదిరెడ్డి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అభిమన్యు శ్రీనివాస్, నాయకులు వంగాల సహదేవారెడ్డి, కొండూరు సత్యనారాయణ, కరీంపాషా, జమాల్ ఖాద్రీ, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, యాదయ్య, దండెంపల్లి సత్తయ్య, పిన్నపురెడ్డి మదుసూదన్‌రెడ్డి, గూన్‌రెడ్డి యుగేందర్ రెడ్డి, బొజ్జ నర్సింహ్మ, కంకణాల వెంకట్ రెడ్డి, కందుల లక్ష్మయ్య, బద్దుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు, (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమ మోపిన అక్రమ కేసులను రద్దు చేసి వారిని విడుదల చేయాలని మునుగోడులో బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక చౌరస్తాలోని బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీష్, నాయకులు మందుల సత్యం, యడవెల్లి సురేష్‌కుమార్, ఈద శరత్‌బాబు, అయితగోని విజయ్‌కుమార్‌గౌడ్, నన్నూరి భూపతిరెడ్డి, మారగోని అంజయ్య, సాధు రాము, దోటి కరుణాకర్, జిల్లా సుఖేందర్, పందుల సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



నల్లగొండలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

చండూరు రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా బార్ కౌన్సిల్ కార్యదర్శి గిరి లింగయ్యగౌడ్ అన్నారు. మండలం తుమ్మలపల్లి గ్రామంలోని సావిత్రిబాయి పూలే గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. మారుమూల గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ రమేష్, ఐతరాజు మోహన్, భువనగిరి రవికుమార్ గ్రామ గ్రంథాలయ పాఠకులు పోలోజు సత్యనారాయణ చారి, కురుపాటి లక్ష్మయ్య, కాశమళ్ళ వెంకటయ్య, గాదపాక రాజ్‌కుమార్, కురుపాటి లింగస్వామి, కాశమల్ల కరుణాకర్, మహేశ్వరం యాదయ్య తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

చిట్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నల్లగొండ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి కట్టా సుధాకర్‌రెడ్డి కోరారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో వెళ్తుందన్నారు. 98వ బూత్ అధ్యక్షుడిగా పాలకూరి వెంకటేశం, 99వ బూత్ అధ్యక్షుడిగా కందాటి చంద్రారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కూనూరు సంజయ్‌దాస్, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, గుండాల నరేష్, గంజి గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనకబడిన సంచార యాచక కులాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ సంచార యాచక కులాల రాష్ట్ర నాయకుడు పర్వతం అంజనేయులు కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార యాచక కులాలు బతుకు దెరువు కోసం ప్రాంతాలు తిరుగుతూ కాలం వెళ్లదీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడమంచి వెంకటయ్య, వానరాశి నారాయణ, కడమంచి సాలయ్య, కడమంచి అంజయ్య, వానరాశి వెంకన్న, యాదగిరి, సింధు, పరుశరాములు, వెంకన్న పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

శాలిగౌరారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల ఆత్మస్థైర్యంతో విద్యానభ్యసించి అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్ పర్సన్, యూత్ ఎంపవర్మెంట్ ట్రైనర్ లయన్ రేపాల మదన్ మోహన్ అన్నారు. శాలిగౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10వేల విలువైన స్పోర్ట్స్ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. ప్రతి విద్యార్థికి విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. చదువు మేధా శక్తిని పెంపొదిస్తే, ఆటలు మానసికోల్లాసాన్ని, శారీరక దారుఢ్యానికి తోడ్పాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ డీసీ మెంబర్, హంగర్ రిలీఫ్ గట్టుపల్లి అశోక్ రెడ్డి, నల్లగొండ లయన్స్ క్లబ్ కార్యదర్శి నిమ్మల పిచ్చయ్య, నకిరేకల్ లయన్స్ క్లబ్ వృద్ధాశ్రమ చారిటబుల్ ఛైర్మన్ నెమరుగొమ్ముల రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేయాలి

మర్రిగూడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేసి ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్థులను గుర్తించాలని జిల్లా డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మర్రిగూడలోని ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. విధులపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఇంటింటా సర్వేలో భాగంగా మధుమేహం, టీబీ, ఇతర వ్యాధిగ్రస్తులను గుర్తించి త్వరగా నివేదికను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, చండూరు డిప్యూటీ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

నాంపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 26.4 । కనిష్ఠం 15.4

ముదిమి వయసులో మూలుగుతూనే..

వారంతా వాచ్‌మెన్‌లు.. వయోభారంతో శరీరం సహకరించకపోయినా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రివేళ ఎముకలు కొరికే చలిలోనూ కాపలా ఉద్యోగాలు చేస్తున్నారు. 16 డిగ్రీల చలిలో పాతికేళ్ల యువకులు సైతం గజగజా వణుకుతున్న వాతావరణంలో ఈ వృద్ధ వాచ్‌మెన్‌లు కళ్లల్లో ఒత్తులు వేసుకొని కాపలా కాస్తున్నారు. ఈదురుగాలిని తట్టుకొని ఒక చేతిలో కర్ర, మరో చేతిలో లైటు పట్టుకొని, గొంతులో వణుకు వస్తున్నా దిగమింగుకొని పనిచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నల్లగొండలో వాచ్‌మన్‌లుగా విధులు నిర్వహిస్తున్న వృద్ధులు

- చలికి వణుకుతున్నా కుటుంబ భారం మోయక తప్పని పరిస్థితి
- ఇంటికి ఆసరాగా ఉంటామని వాచ్‌మన్లుగా విధులు
- అరకొర వేతనాలతో శ్రమదోపిడీ
- ప్రశ్నిస్తే ఉన్న ఉద్యోగమూ ఉండదనే ఆందోళన
- చలికోట్లు, మఫ్లర్లు కూడా ఇవ్వని యాజమాన్యాలు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వృద్ధ కాపలాదారుల అవస్థలు వెలుగులోకి...

ఆంధ్రజ్యోతి పరిశీలన

చలిని తట్టుకునేందుకు, ఈదురుగాలుల నుంచి కాపాడుకునేందుకు అవసరమైన చలికోట్లు (స్వెట్టర్లు), మఫ్లర్లు, బూట్లు, కాసేపు మేనువాలిస్తే కప్పుకోవడానికి రగ్గులు, గొంగడి వంటివేవీ వాచ్‌మన్‌లకు అందుబాటులో లేవు. గజగజా వణికే చలిలో ఏజెన్సీలిచ్చిన డ్రస్సు ధరించి కొందరు వారు విధులు నిర్వర్తించాల్సిన చోట స్టూల్ పైనే కూర్చొని కాపలా కాస్తుంటే, మరికొందరు లైటు, కర్ర పట్టుకొని వారి బీట్‌చుట్టూ పహారా కాస్తున్నారు. భవన నిర్మాణాల వద్ద ఉండే వాచ్‌మెన్‌ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇక్కడ ఉండే వాచ్‌మెన్‌లు 60 ఏళ్లకు పైబడ్డవారే కావడంతో చలికి వణుకుతున్నారు. చలిని తట్టుకునే ఎలాంటి సదుపాయాలు వీరికి కూడా అందుబాటులో లేవు. పైగా రాత్రివేళ పని ప్రదేశం వద్ద ఏదైనా వస్తువు చోరీకి గురైతే ఉదయం మళ్లీ యజమానుల నుంచి చివాట్లను ఎదుర్కోవాల్సిన దయనీయ స్థితి వీరిది. వాచ్‌మెన్‌లకు కనీస వేతనాలివ్వకపోగా, పనిప్రదేశాల్లో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించకుండా శ్రమదోపిడీ చేస్తున్న దుస్థితి 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగు చూసింది. నల్లగొండ పట్టణంలోనే కాదు, ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి,చౌటుప్పల్ పట్టణాల్లో పలువురువృద్ధులు వాచ్‌మన్‌లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటీఎంల వద్ద,దుకాణ సముదాయాల వద్ద, భవన నిర్మాణ పనులవద్ద,అపార్ట్‌మెంట్లవద్ద, గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ల వద్ద పనిచేస్తున్న వాచ్‌మెన్‌ల అందరి పరిస్థితి ఒకేలాగే ఉంది.

అరకొర వేతనాలు

నల్లగొండ ఉమ్మడి జిల్లాలో సెక్యూరిటీ ఏజెన్సీల పరిధిలో పనిచేసే వాచ్‌మన్‌లు శ్రమదోపిడీకి గురవుతున్నారు. వీరిలో రాత్రిపూట వాచ్‌మన్‌గా ఉద్యోగం నిర్వర్తించేవారు ఎక్కువ పనిగంటలు కూడా పనిచేస్తున్నారు. ఏటీఎంల వంటి చోట్ల 8గంటల పాటు పనిచేస్తే నెలకు రూ.8,000 ఇస్తున్నారు. షోరూమ్‌లు, ఇతర దుకాణాల వద్ద సాయంత్రం 7 నుంచి ఉదయం 7గంటల వరకు పనిచేస్తే రూ.10వేల నుంచి రూ.12వేలు యజమానులు చెల్లిస్తున్నారు. రాత్రివేళ పనిచేసే వాచ్‌మన్‌లు సుమారు 55 ఏళ్ల వయసుకు పైబడ్డవారే ఉన్నారు. అయినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఎంతో కొంత ఆసరాగా ఉంటామనే ఉద్దేశంతో తక్కువ వేతనాలకైనా పనిచేస్తున్నారని. నెలకు కేవలం రెండు రోజులే సెలవులిస్తారని, అంతకుమించి సెలవులు తీసుకుంటే వేతనంలో..

- మిగతా 6వ పేజీలో...

చలైనా, వానైనా డ్యూటీ తప్పదు



నేనుకొన్నేళ్లుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నా. రాత్రంతా డ్యూటీ చేస్తే నెలకు రూ.11వేల వేతనమిస్తారు. చలైనా, వానైనా పహారా తప్పదు. రాత్రివేళ కళ్లల్లో ఒత్తులు వేస్కొని మేల్కొని ఉండాల్సిందే. ఏ చిన్న పొరపాటు జరిగినా మళ్లీ మేమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాత్రంతా షోరూమ్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిందే. స్వెట్టర్లు, రగ్గులు ఏమీ ఇవ్వరు. కేవలం యూనిఫాం మాత్రమే ఇస్తారు. పెరిగిన వయసు చలికి తట్టుకోలేకపోతున్నా, కుటుంబ బాధ్యతలతో పనిచేయక తప్పడం లేదు.

- మారగోని సూరయ్య, 53 ఏళ్లు, గడ్డికొండారం, తిప్పర్తి మండలం

పని చేస్తేనే కుటుంబం గడుస్తుంది

రెక్కాడితేనే డొక్కాడే కుటుంబం మాది. ఇక్కడే గుడిసె వేసుకొని ఉంటున్నాం. రాత్రి పూట వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నా. రూ.7500 వేతనం ఇస్తున్నారు. నా భార్య, నేను ఇక్కడే పనిచేస్తున్నాం. ఇద్దరం పనిచేస్తేనే కుటుంబం గడుస్తుంది. పని వెతుక్కోవడమే తప్ప, సదుపాయాలు, వసతులు అడిగే పరిస్థితి మాకు ఉండదు. చలికాలమైనా, వానాకాలమైన సర్దుకొని పనిచేస్తేనే కుటుంబం గడుస్తుంది. అంతకంటే మేం చేసేదేమీలేదు. చలికోట్లు, రగ్గులు కొనుగోలు చేసే స్తోమత మాకు లేదు. ఎవరైనా పాతవి ఇస్తే వాటినే ధరిస్తున్నాం.



- గుండె ఎల్లయ్య (62), ఉల్సాయిపాలెం, నల్లగొండ జిల్లా

యాదరుషి,భక్త ప్రహ్లాదకు ప్రత్యేక మండపాలు



గిరిప్రదక్షిణ దారిలో నిర్మాణంలో ఉన్న యాదరుషి మండపం

- గిరి ప్రదక్షిణ దారిలో నిర్మాణం
- రెండో ఘాట్ రోడ్డులో యాదరుషికి మండపం
- సత్యనారాయణస్వామి వ్రత మండపం వెనుక భక్త ప్రహ్లాద మండపం
- తుది దశలో పనులు
- స్వామివారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని విగ్రహాల ప్రతిష్ఠ

యాదాద్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కోసం యాదగిరిగుట్టపై మహా తపస్సు చేసినయాదరుషి, పరమ భక్తుడు భక్త ప్రహ్లాదుడిని దర్శించుకునేలా ప్రత్యేక మండపాలను భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పుణ్యక్షేత్రానికి కారణమైన యాదరుషితో పాటు భక్తప్రహ్లాదుడికి గిరి ప్రదక్షిణ దారిలో మండపాలు నిర్మించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గిరి ప్రదక్షిణ దారిలో యాదరుషి మండపాన్ని రెండోఘాట్ వద్ద, ప్రహ్లాదుడి మండపాన్ని సత్యనారాయణస్వామి వ్రత మండపం వెనుక గిరి ప్రదక్షణదారి వెంట నిర్మించారు. వారం రోజుల్లోగా ఇక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఒక్కో మండప నిర్మాణానికి రూ.4లక్షలు, మొత్తంగా రూ.8లక్షలతో మండపాల నిర్మాణంతోపాటు చుట్టు పక్కన గార్డెనింగ్, భక్తులు దర్శనార్థం మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఈ నెల 26న స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా అందుబాటులోకి తేనున్నారు.

'గిరి ప్రదక్షిణ' భక్తులకు సౌకర్యాలు

స్థానిక భక్తులు యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకోవడం

- మిగతా 6వ పేజీలో...

ఆధ్యాత్మికంగా.. ఆధునికంగా..

యాదరుషితో పాటు భక్త ప్రహ్లాదుడి పేరు మీద యాదగిరిగుట్ట ప్రసిద్ధికెక్కింది. ఆలయ పునర్నిర్మాణం,విస్తరణలో భాగంగా యాదరుషి విగ్రహాన్ని కొండ కింద తులసి కాటేజీ వద్ద మర్రి చెట్టు వద్ద ఏర్పాటుచేశారు. రోడ్డు డివైడర్‌కు పక్కనే ఉండటంతో యాదరుషిని భక్తులు దర్శించుకునే వెసులుబాటు లేకుండా పోయింది. దీంతో యాదరుషి మండపాన్ని మరోచోట ఆధ్యాత్మికంగా..ఆధునికంగా నిర్మించాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు కొండ కింద గిరి ప్రదక్షిణ దారిలో మండపాలను నిర్మించారు. యాదరుషి, భక్త ప్రహ్లాదుడి విగ్రహాలతో పాటు గుట్ట ప్రాశస్త్యం కూడా మండపాల వద్ద లిఖిత రూపంగా అందుబాటులో ఉంచనున్నారు.

ఆంధ్రా నుంచి ధాన్యం

- చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ బందోబస్తు
- సరిహద్దుల్లో అదనంగా మరో రెండు ఏర్పాటు



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న కోదాడ రూరల్ ఎస్ఐ, సిబ్బంది

ఆంధ్రా నుంచి పెద్ద మొత్తంలో ధాన్యం వస్తుండడంతో అధికారులు అప్రమత్తమై ఇప్పటికే సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచారు. దీంతోపాటు అదనంగా మరో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ రూరల్)

రాష్ట్రంలో ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటా కు రూ.500 బోనస్ ఇస్తోంది. దీంతో ఏపీ రాష్ట్రం నుంచి కొంతమంది దళారులు రాత్రివేళల్లో సరిహద్దు చెక్‌పోస్టును తప్పించుకుని అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రామాపురం క్రాస్ రోడ్డు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అధికారులు బందోబస్తును పటిష్ఠపరిచారు. సోమవారం అర్ధరాత్రి 20కి పైగా లారీల్లో వచ్చిన ధాన్యాన్ని గుర్తించి వెనక్కిపంపినట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు. దీంతో దళారులు మరిన్ని అడ్డదారులు వెతుక్కున్నారు. చెక్‌పోస్టుకు సుమారు 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నవరం గ్రామం నుంచి రెడ్లకుంట, కాపుగల్లు గ్రామాల మీదుగా కోదాడ, అక్కడి నుంచి సూర్యాపేటకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. అంతేగాక రాత్రివేళలో ఖమ్మం జిల్లా మీ దుగా లారీలు కొండపల్లి, అనంతగిరి మండలం గోండ్రియాల మీదుగా కోదాడ మిల్లులకు ధాన్యం తరలిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఏపీ రాష్ట్రం జగ్గయ్యపేట, వత్సవాయి మం డలాల నుంచి ధాన్యం రాత్రివేళలో పెద్ద మొత్తం లో కోదాడకు వస్తోంది. దీన్ని గుర్తించిన అధికారు లు చెక్‌పోస్టుల వద్ద బందోబస్తు పటిష్ఠం చేయడంతోపాటు అన్నవరం, రెడ్లకుంట మధ్య మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా నుంచి ధాన్యం రాకుండా అనంతగిరి మండలం గోండ్రియాల వద్ద మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీంతో ఏపీ నుంచి ధాన్యం వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఏపీ ధాన్యాన్ని కట్టడి చేయాలి

(ఆంధ్రజ్యోతి, అనంతగిరి, మేళ్లచెర్వు, మఠంపల్లి): మండల పరిధిలోని గోండ్రియాల గ్రామం మీదుగా ఏపీ రాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా కట్టడి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం పౌరసరఫరాలశాఖ రాజేశ్వరరావుతో కలిసి గోండ్రియాల గ్రామంలో చెక్‌పోస్టు ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్, రెవెన్యూ శాఖలు రెండు బృందాలుగా ఏర్పడి చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్లు వాజిద్ అలీ, హిమబిందు, ఎస్ఐ అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చింతలపాలెం మండలంలోని కృష్ణానదిపై ఉన్న చింతిర్యాల బల్లకట్టు, పులిచింతల ప్రాజెక్టు, బుగ్గమాదారం బల్లకట్టు, దొండపాడు చెక్‌పోస్టు, మేళ్లచెర్వు మండలంలోని రామాపురం చెక్‌పోస్టులను అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. మఠంపల్లి మండలం మట్టపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఇక్కడ గతంలో ఇద్దరు పోలీసులు ఉండగా, మరో ఇద్దరిని అదనంగా కేటాయించి పటిష్ఠంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు సురేందర్‌రెడ్డి, మంగా, డీటీసీ ఎస్‌లు రాంరెడ్డి, రాజశేఖర్, చింతపాలెం ఎస్ఐ అంతిరెడ్డి, ఆర్ఐ వాసుదేవరావు, తదితరులు ఉన్నారు.

19న జేడీఏతో శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'

సంప్రదించాల్సిన నంబర్ 7288800023

ఉదయం 11 నుంచి 12 గంటల వరకు



నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో విత్తనాలు, ఎరువులు మొదలుకుని రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. గురువారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు జేడీఏ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులు అడిగే ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు ఇవ్వనున్నారు. రైతులు ఫోన్ నెంబర్ 7288800023లో సంప్రదించాలి. జిల్లాలోని రైతులంతా ఈ కార్యక్రమం ద్వారా విలువైన సమాచారం తెలుసుకునే వీలుంది.

చట్టంలో డిజిటల్ అరెస్టు లేదు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, ఫెడెక్స్ కొరియర్ అంటూ జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం తన కార్యాలయం ఆయన మాట్లాడారు. ఇటీవల ముంబై పోలీసులమని సైబర్ నేరస్థులు సామాన్య ప్రజలను, ఉద్యోగులను టార్గెట్ చేసుకున్నారన్నారు. ఫోన్ చేసి ముంబై నార్కోటిక్స్, సీబీఐ పోలీసులమని ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు చెప్పి, ఓ పార్సిల్ ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్ దేశాలకు వెళ్లేందుకు బుక్ అయిందని, అందులో నార్కోటిక్స్ డ్రగ్స్ ఉన్నాయని, కేసు బుక్ చేస్తున్నామని మోసగిస్తారని వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసు నమోదుకాకుండా ఉండాలంటే వెంటనే డబ్బు పంపాలని కోరతారని, ఎవరికీ డబ్బు పంపవద్దని సూచించారు. అలాగే బ్యాంకు లోను తీసుకునే విధంగా చేసి, ఆ డబ్బు వారికి పంపాలని మోసాలు చేస్తున్నారని అన్నారు. ముంబై నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ అని చెప్పి నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో ఓ బాధితురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ.5లక్షలు లూటీ చేశారని వివరించారు. ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో నల్లగొండ టూటౌన్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. ప్రజలు, యువత, ఉద్యోగులు ఇలా వచ్చిన ఫోన్స్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి ఘటన ఎదురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదంటే సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో రిపోర్టు చేయాలని ఎస్పీ సూచించారు.

మరింత పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రత

15.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నల్లగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయి. రోజురోజుకూ చలిగాలుల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం 16.0డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మంగళవారం 15.4డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఆరురోజులుగా చలి గాలులు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి.పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అందరికీ ఉపయోగపడేలా

- ఉపాధి పనుల జాతర
- ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు



యాదాద్రి జిల్లా ముశిపట్ల నర్సరీలో మొక్కల పెంపకానికి బ్యాగులో మట్టి నింపుతున్న కూలీలు

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు ఎక్కువ గా కంపచెట్ల తొలగింపు, చెరువుల పూడికతీత పనులే జరిగేవి. కూలీలను ఎక్కువగా రప్పించేందుకు అధికారులు ఈ పనులు ఎంచుకునే వారు. కొన్నిచోట్ల పడావుబడిన భూముల్లో భూఅభివృద్ధి పేరుతో కంప చెట్లు తొలగించేవారు. ఆ రైతు ఆ భూమిని వెంటనే సాగులోకి తేక వదిలేస్తే అక్కడ మళ్లీ కంపచెట్లు పెరిగేవి. రోడ్ల వెంట పెరిగిన కంప చెట్లు కొట్టినా అదే పరిస్థితి ఉండేది. దీనికి కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉపాధి హామీలో వైవిధ్యమైన (పలు రకాల) పనులు చేపట్టాలని ఆదేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ పనుల జాతరను చేపట్టింది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధిహామీ జాబ్ కార్డులు 7.65లక్షల వరకు ఉన్నాయి. అందులో యాదాద్రి జిల్లాలో 1.43లక్షలు, సూర్యాపేట జిల్లాలో 2.63లక్షలు, నల్లగొండ జిల్లాలో 3.59 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి పనుల జాతరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు ఉపయోగపడే పనులు ఎక్కువగా చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. మహిళా శక్తి ఉపాధి భరోసా కింద ఐదు రకాల పనులు చేపట్టనున్నారు. ఐకేపీ నుంచి పాడి పశువులు తీసుకున్న వారికి పశువుల దొడ్డి నిర్మిస్తారు. అజోలా పెంపకం, వర్మీ, నాడెపు కంపోస్టు ఎరువు తయారీ, కోళ్ల పెంపకం, భూఅభివృద్ధి పనులు చేపడతారు. పొలంబాట కింద వ్యవసాయ బావుల వద్దకు రహదారుల నిర్మాణం చేపడతారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామానికి ఒక యూనిట్ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ మండలానికి ఐదెకరాల చొప్పున పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. జల నిధి కింది గల్లీ కంట్రోల్ వర్క్స్‌గా చెల్కల్లో వరదలు పారే చోట వరద నీరు ఒకే సారి ప్రవహించి భూమి

- మిగతా 6వ పేజీలో...

సర్వే బృందాలకు సమాచారం ఇవ్వాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు సర్వే బృందాలకు సరైన సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన జరుగుతోందన్నారు. అధికారులు దరఖాస్తుదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారని, వారు వచ్చే సమయంలో అందుబాటులో ఉండాలని కోరారు. సర్వే బృందాలకు ప్రస్తుతం ఉన్న ఇంటి వివరాలు ఫొటోతో సహా యాప్‌లో నమోదు చేస్తారన్నారు. సర్వే నెమ్మదించిన మండలాల్లో కారణాలను విశ్లేషించి నివేదిక అందజేయాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అధికారులు సర్వేకు వచ్చే రోజు సమాచారాన్ని ప్రజలకు ముందుగా తెలియజేయాలన్నారు. ఏదైనా కారణంతో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేయని వారు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయవచ్చన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ కోసం గతంలో దరఖాస్తుచేసుకోని వారు సైతం ఈ కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన యుద్ధప్రాతిపదికన చేయాలని, 500 ఇళ్లు దాటినచోట ప్రతీ మండలానికి ఒక కొత్త యూజర్ ఐడీ క్రియేట్ చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు బ్రాహ్మణవెల్లెంలలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుకు వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ ఇలాత్రిపాఠిని కలిశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశమై వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలి

(కట్టంగూరు, ఆంధ్రజ్యోతి): ఆధునిక యంత్రాలు ఉపయోగించి రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. రైతులు సంఘటితంగా ఏర్పడి సాగులో సాంకేతికను ఉపయోగించడం అభినందనీయమన్నారు. ఎఫ్‌పీవో అభివృద్ధి కోసం తనవంతు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేడీఏ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీవో ఛైర్మన్ చెవుగోని సైదమ్మ, ఏవో గిరి ప్రసాద్, వాడపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలు ఎన్నాళ్లకో..?

ఫటాఫట్ FATAFAT

గ్రామీణ రోడ్లకు రూ. 205 కోట్లతో ప్రతిపాదనలు

● వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ



వానాకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు గుంతలమయమైన రోడ్ల మరమ్మతుకు, కొత్త ఫార్మేషన్ రోడ్ల కోసం మిర్యాలగూడ డివిజన్ పరిధిలో రూ. 205 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ ఈఈ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ. 44 కోట్లతో మంజూరు కావడంతో టెండర్ పిలవగా ఒక్క టెండర్ కూడ రాలేదని ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ఆంధ్రజ్యోతి: గతేడాది కాలంలో డివిజన్ పరిధిలో ఎన్ని వర్క్‌లు చేపట్టారు?

పీఆర్ ఈఈ : మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లో రూ. 205 కోట్ల విలువైన పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: టెండర్లు ఎప్పుడు పిలిచారు?

పీఆర్ ఈఈ : మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లోని 8 మండలా ల్లో రూ.28 కోట్ల బీటీ రోడ్లకు టెండర్లు పిలిచాం. ఒక్క వర్క్‌కు కూడా కాంట్రాక్ట ర్లు టెండర్ కోట్ చేయలేదు. పనులు ప్రారంభం కాలేదు.

ఆంధ్రజ్యోతి: ఎన్ని కొత్త రోడ్ల నిర్మాణం చేపడుతున్నారా?

పీఆర్ ఈఈ: మిర్యాలగూడ డివిజన్‌లో మొత్తం 26 కొత్తరోడ్ల నిర్మాణానికి రూ.51 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు, బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.153.55 కోట్ల ప్రతిపాదనలు పంపించాం

ఆంధ్రజ్యోతి : కాల్వపల్లి- గూడూరు వయా అవంతీపురం రోడ్డు ఎప్పటికి పూర్తవుతుంది?

పీఆర్ ఈఈ: కాల్వపల్లి నుంచి గూడ దూరు డబుల్‌రోడ్డు పనులు 2022లో ప్రారంభించాం. 9 కిలోమీటర్లకు రూ.5 కోట్లతో పనులు చేపట్టగా 4.5 కిలో మీటర్లు పూర్తి చేశాం. అటవీశాఖ అనుమతులు లేక బీటీ రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇటీవల ఆ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ప్రభుత్వం అదనంగా రూ. 8 కోట్లు మంజూరు చేసినట్టు సమాచారం ఉంది. ఉత్తర్వులు అందగానే రోడ్డు పని ప్రారంభిస్తాం.



ఆనవాళ్లు కోల్పోయిన జానకీరామ ఎత్తిపోతల పథకం

మెట్ట భూములను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎత్తి పోతల పథకాలు వృథాగా మారాయి. ఏళ్లతరబడి మరమ్మతులు లేక మూలకు పడ్డాయి. మోటార్లు, స్టార్టర్లు, పైపులు, కాల్వలు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎత్తిపోతల పథకాల కింద ఉన్న పంట భూములు నేడు బీళ్లుగా మారి రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,త్రిపురారం)

త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ చుట్టు ఉన్న గ్రామాల పరిధిలోని భూములకు రెండు దశాబ్దాల క్రితం సాగు నీరు లేక పడావుగా ఉండేవి.. పెద్ద చెరువు ఉన్న సాగునీరు లేక పోవడంపై రైతులు అప్పటి పాలకులకు ఎన్నో విజ్ఞప్తుల మే రకు చాలా కాలం తరువాత పాలకులు రిజర్వాయర్ చుట్టూ ఉన్న గ్రామాలైన దుగ్గేపల్లి, కామారెడ్డిగూడెం, బృందావనపురం గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు.

మూణ్ణాళ్ల ముచ్చట

రిజర్వాయర్ నీటిని వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించారు.. 1990 దశకంలో ఎత్తిపోతల పథకాల నిర్మా ణంలో భాగంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పైప్‌లైన్లు, కాల్వలు, తూములు ఏర్పాటు చేశారు.. ప్రారంభంలో సాగు నీరు పుష్కలంగా అందడంతో రైతులు పంటల సాగు శ్రీకా రం చుట్టారు.. సుమారు దశాబ్ద కాలం పాటు ఎత్తిపోతల పథకాలు ఎలాంటి అంతరాయం లేకుండా నడిచాయి. తరువాత కాలంలో ఎత్తిపోతలకు మర మ్మతులు మొదలయ్యాయి, ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.. రైతులు ఎత్తిపోతల పథకాలను నడిపించుకోవాలని సూచించి సర్కారు చేతులెత్తేసింది.. రైతులకు నిర్వహణ భారం కావడంతో పథకాలు అన్ని మూలకు పడ్డాయి

సాగు నీటి కోసం పాట్లు..

ఎత్తిపోతల పథకాలు నమ్ముకుని భూములను బాగు చేసుకుని వరితో పాటు వివిధ పంటలు సాగు చేసుకున్నారు.. పథకాలు పనిచేయక పోవడంతో సాగు నీటి సర ఫరా నిలిచిపోయింది. పంట భూములు కాస్తా పడావుపడ్డాయి.. కొంత మంది లక్షల రూపాయ లు ఖర్చు చేసుకుని బోర్లు బావుల కోసం భగీరథ ప్రయత్నం చేశారు.. నీటి లభ్యత లేక పోవడంతో చాలా మంది రైతులు భారీగా నష్టపోయారు.. ఆర్థిక స్థోమత లేని రైతులు భూములు వదిలేశారు..

- రాగడప ఎత్తిపోతలకు 150 ఎకరాల ఆయకట్టుకాగా, బోర్లు పడక పోవడంతో భూములు నిరుపయోగంగా మారాయి.
- బృందావనపురం 2-3 ఎత్తిపోతలకు 857 ఎకరాలు ఆయకట్టు కాగా, మోటార్లు పని చేయడం లేదు..పైపులు తుప్పు పట్టాయి..
- కామారెడ్డి గూడెం ఎత్తిపోతలు: (ఎల్-8-9ఏ) కు 1,875 ఎకరాలు కాగా, ప్రస్తుతం ఈ ఎత్తిపోతల మొదటి దశను ఐదేళ్లుగా రైతులు సొంత ఖర్చులతో నడిపించుకుంటు న్నారు. రెండో దశ పూర్తి స్థాయిలో పడావు పడింది. దాంతో సగం ఆయకట్టుకు నీరందడం లేదు..
- తెలంగాణ ఎత్తిపోతలకు 900 ఎకరాలు కాగా, 2014 సంవత్సరం నుంచి పనిచేయడం లేదు..
- జానకీరామ ఎత్తిపోతలు రెండు దశల్లో 500 ఎకరాలు ఆయకట్టు కాగా, 2013 నుంచి పని చేయడం లేదు..

ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలి

పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌పై ఉన్న ఎత్తిపోతల పథకాలు దశాబ్దాలు పని చేయడం లేదు.. మరమ్మతులు చేప ట్టడానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

- మోటార్లను మరమ్మతులు చేపట్టాలి.
- స్టార్టర్లు,వైర్లు,స్విచ్‌లు ఏర్పాటుచేయాలి.
- పైప్‌లు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.
- కాల్వలు చెట్లతో పూడిపోయాయి వాటిని పూర్తిస్థాయిలో పూడిక తీయాలి.
- ధ్వంసమైన తూములు పటిష్టపరచాలి.

పది బోర్లు వేసి నష్టపోయా



దశాబ్దాలుగా కాలంగా రాగడప ఎత్తిపోతలు పథకం పని చేయడం లేదు. నా కున్న ఐదెకరాల్లో పది బోర్లు వేశాను.. ఒక్కటి పడలే దు.. సుమారు రూ.2లక్షల వరకు నష్టపోయా ను. బావి త వ్వించాను.ఎకరం మాత్రమే నీరు పారుతుంది.. కుటుంబం గ డవడం కష్టంగా ఉంది. ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టాలి.

-పోషబోయిన సైదయ్య రైతు,రాగడప

సొంత ఖర్చులతో నడిపించుకుంటున్నం



కామారెడ్డిగూడెం ఎత్తిపోతల పథకం మొద టదశ కింద నాకు మూడెకరాల భూమి ఉంది. మరమ్మతులు గురైన అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో ఐదేళ్లుగా నుంచి రైతులందరం కలిసి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకుని ఎత్తిపోతల పథకం నడిపించుకుంటున్నం .ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

- అంజయ్య ,రైతు, కామారెడ్డిగూడెం

మరమ్మతులకు నిధులు రాలేదు

ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

- కేశవ్, ఎన్ఎస్‌పీ, డీఈ



పడావుపడిన రాగడప ఎత్తిపోతల పథకం

మిర్యాలగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

మిర్యాలగూడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ శివారు ప్రాంతంలో సర్వేనంబర్ 626లోని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. ముందుగా 711 సర్వేనంబర్‌లో భూమి కొనుగోలు చేసినవారు 626 సర్వేనంబర్ లోని ప్రభుత్వం భూమిని 3 ఫీట్ల వెడల్పు 600 మీటర్ల పొడవు సు మారు 3 గుంటలు ఆక్రమించి ప్రహరీ నిర్మాణంతో పాటు గేటును ఏర్పాటు చేసి తాళం వేయగా అధికారులు యంత్రం సాయం గేటును ధ్వంసం చేశారు. కాగా మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌కు సంబ ధించిన కట్టడాలను అధికారులు తొలగిస్తున్నారని ప్రచారం జరగడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మార్కింగ్ చేయక ముందే ఆక్రమణ అని ఎలా నిర్ధారిస్తారని చైర్మన్ భార్గవ్ అక్కడి చేరుకుని తహసీల్దార్ హరిబాబును నిల దీశారు. నెల రోజుల క్రితమే సర్వేనంబర్ 626 లోని భూ మిని డిజిటల్ సర్వే చేసినట్లు మ్యాప్ ప్రకారమే కూల్చివేస్తున్నట్లు సమాధానం ఇచ్చారు. హద్దులు నిర్ణయించి కడీలు పాతుతామని చెప్పారు. అనంతరం తాపీ పని వారుల సంఘం భవన్ పేరుతో శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు వేసిన బేబేస్‌మెంట్, సిమెంట్ ఇటుకలతో నిర్మించిన గదిని అధికారులు పూర్తి గా కూల్చివేశారు. సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ సంఘటనా స్థలానికి వచ్చి ఆక్రమణల తొలగింపుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా బోర్డు లు ఏర్పాటు చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆధ్వ ర్యంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ కూల్చివేతల నిర్వహించారు. పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

భూమి నాదేనని అధికారులు దూకుడు: మున్సిపల్ చైర్మన్ భార్గవ్

సర్వే నంబర్ 711లోని భూమి నాది అని భావించడం వల్లే 626 లోని భూమిని ఆక్రమించానని ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రహరీ తొలగించారు. కనీసం మార్కింగ్ చేసి హద్దులు నిర్ణయించకుండానే గేటును ధ్వంసం చేశారు. ఒత్తిడితోనే అధికారులు దూకుడు ప్రదర్శి స్తున్నారు. 711 సర్వే నంబర్‌లో భూమి తనది కాదని తన అక్క రాయపూడి భవానికి చెందినదని అన్నారు.



కూల్చివేతలపై వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

అక్రమ కట్టడాలను కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్

నోటీసులు ఇవ్వలేదు



సర్వే నం.711 లో 24 గుంటల భూమిని 2012లో నా భార్య రాయపూడి భవాని పేరుతో కొనుగోలు చేశా. ప్రహరీపై నాభార్య పేరు సెల్ నంబర్ రాయించాను. అధికారులు సర్వే నంబర్ 626 లోని భూమి ఆక్రమణకు పాల్ప డినట్లు భావిస్తే ఫోన్ చేస్తే నేనే వచ్చి తాళం తీసే వాడిని. ప్రభుత్వ అధికారుల సర్వేకు సహక రించే వాడిని. ఎలాంటి సమాచారం లేకుండా నా భూమి చుట్టూ నిర్మించుకున్న, ప్రహరీ, గేటును కూల్చివేశారు. అధికారులకు ఇది తగదు.

-రాయపూడి ఉమా శేఖర్

ప్రభుత్వ భూమి అక్రమిస్తే క్రిమినల్ కేసులు



ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే సహించేది లేదు. నిర్మాణాలు కూల్చడంతో పాటు ఇకపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. సర్వే నంబర్ 626లో భూమి విలువైంది. దీనిలో ఆక్రమణలు జరుగు తున్నట్లు మా దృష్టికి వచ్చింది. నెలరోజుల క్రితం డిజిటల్ సర్వే జరిపాం. దాని ప్రకారం ఆక్రమణల తొలగించాం.

- హరిబాబు, తహసీల్దార్

యువకుడు అదృశ్యం

దామరచర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ కుటుంబసభ్యులకు వీడియోకాల్ చేసిన అనంతరం యువకుడు అదృశ్యంపై కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాడపల్లి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన రమావత్ శంకర్(25) సెల్‌టవర్ల నిర్మాణ సంస్థలో కూలీ పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఇటీవల తనకు బైక్ కావాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడంతో ఆరు నెలల క్రితం బైక్ ఇప్పించారు. తిరిగి కొద్ది రోజులుగా కారు కావాలని కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని కారు కొనుగోలు చేయడం సాధ్యం కాదని శంకర్‌కు నచ్చ జెప్పారు. దీంతో శంకర్ రెండు రోజుల క్రితం తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలపడంతో వారు అప్రమత్తమైన 100 కాల్ చేసి సమాచారం అందించడంతో సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా దామరచర్ల శివారులో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తిరిగి మంగళవారం వాడపల్లి శివారులోని కృష్ణానది వంతెన వద్ద నుంచి తాను కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబసభ్యులకు వీడియోకాల్ చేశాడు అప్రమత్తమైన కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేర కునే సరికి శంకర్ చెప్పులు, సెల్‌ఫోన్ బ్రిడ్జి పక్కన పడి ఉన్నాయి. శంకర్ కనిపించకపోవడంతో నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వారు భావిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నది బ్రిడ్జి సమీపంలో గాలింపు చేపట్టారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

కొండమల్లేపల్లి, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న వినియోగిస్తున్న సుమారు రూ.2లక్షల విలవైన 200 సెంట్రింగ్ బాక్స్‌లు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు జక్కుల కృష్ణయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

సీఎం కప్ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక



వహీద్, సమీర్

గుర్రంపోడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ సీనియర్ కబడ్డీ జిల్లా జట్టుకు మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్, పీఈటీ శ్రీను తెలిపారు. ఈనెల 16న నల్లగొం డలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వహీద్, సమీర్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

గుర్రంపోడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను డీఎస్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. కొప్పోలులో జరుగుతున్న సర్వేను పరిశీలించి సర్వేను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీవో మంజుల, ఇన్‌చార్జి డీటీసీఎస్ రావుల సైదులుగౌడ్ పాల్గొన్నారు.

రజకార్లను తలదన్నేలా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన

దేవరకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రజకార్లను తలదన్నే విధంగా ఉందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ పిలుపుమేరకు దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి రవీంద్రకుమార్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గాజుల ఆంజనేయులు, లోక్యా నాయక్, శంకర్‌నాయక్, సుభాష్‌గౌడ్, రవికుమార్, వేములరాజు, కృష్ణ పాల్గొన్నారు.

● హాలియా, (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనుముల బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, వడ్డే సతీష్‌రెడ్డి, చాపల సైదులు, జవ్వాజి వెంకటేశ్వర్లు, ఉర్లగొండ వెంకటయ్య, ఉడుతూరి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ సుధాకర్, చేగొండి కృష్ణయ్య, అనుముల ఏడుకొండలు, సురబి రాంబాబు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)-(ఆంధ్రజ్యోతి) మండలంలోని కొంపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగ య్య పగడాల పెద్దిరాజు, కొత్తపల్లి శ్రీను, మల్లికార్జున్, పల్లె నరేష్, బుచ్చిబాబు, రవి, శ్రవణ్, మహేష్ ఆపాల్గొన్నారు.



దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద కుమార్

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



చింతపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

చింతపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. మండల కేంద్రంలోని 33, 34 బూతు కమిటీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం రాజకీయలబ్ధి కోసమే కాలయాపన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, కుక్కడుపు రామకృష్ణ, వెన్నం శేఖర్, మహమ్మద్ జహంగీర్, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు మహేష్ గౌడ్, కుందేళ్ల శ్రీశైలం, గజ్జె అభినవ్, గంగుల వెంక టయ్య, జక్కుల రమేష్, రాపర్తి సతీష్ గడ్డి సైదులు, శివర్ల నగేష్, మొగిలమోని రవి, మహేందర్, శేఖర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

(మిర్యాలగూడటౌన్-ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాదినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అంద రి కృషితోనే పార్టీ రాష్ట్రంలో ద్వితీయస్థానానికి చేరుకుందన్నారు. కాగా పార్టీ నాయకుడు బంటు సైదులు పలు వార్డుల్లో పర్యటించి ఇన్ చార్జులుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో బొడ్డు సోములు, బంటుగిరి, నాగిరెడ్డి, అజయ్, శ్రీను, పాల్గొన్నారు.

పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పైలట్ ప్రాజెక్టులో భాగంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని రైతులు అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు విన్నవించారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి మండలంలోని పలు గ్రామాల రెవెన్యూ శివారులో భూ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అధికారులను కలిసిన వారిలో మేరావత్ మునినాయక్, రైతులు రామారావు, పాండు, చినేష్, స్వామి, ముని, సోమ్లా, శ్రీను, రాము, సైదయ్య, బాలు, నాగయ్య, మోహన్ ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామశివారులో ఈ సంఘటన జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం బదలాపురం గ్రామానికి చెందిన కన్నెకంటి రాకేష్(24) కొంత కాలంగా గూడూరు గ్రామ శివారులోని ఓ రైస్‌మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన రాకేష్ రాత్రి పొద్దుపోయే వరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుమారుడి ఆచూకీ కోసం తండ్రి కుమారస్వామి, మిత్రుడు నల్లమేకల శ్రీనివాస్ గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గూడూరు గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశంలో అచేతనంగా పడిఉన్న రాకేష్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పక్కన బీరు బాటిల్, ఎలుకల మందు ప్యాకెట్ ఉండడంతో బీరులో ఎలుకల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాకేష్ మిల్లుకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించటంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మల్టీపర్పస్ వర్కర్ల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న పంచాయతీ వర్కర్లు.

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలను డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ల చలో హైదరాబాద్ నేపథ్యంలో స్థానిక పంచాయతీ వర్కర్లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. మండలానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్లు హైదరాబాద్‌కు వెళ్తున్నారన్న సమాచారంతో మం డలానికి చెందిన పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వేతనాలను పెంచుతామని నాయ కులు హామీ ఇచ్చినప్పటికీ వాటిని నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో అనుముల వెంకటేశ్వర్లు, వెంకటయ్య, బట్ల శ్రీను, శాగం మంగమ్మ, ముత్తయ్య తదితరుల ఉన్నారు.

బీసీలను అవమానిస్తే ఊరుకోం



జ్యోతిరావుపూలేవిగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీలను అవ మానిస్తే ఊరుకోబోమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌పై బీఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కీలక పద వుల్లో ఉన్న బీసీ నేతలను విమర్శించడం పరిపాటిగా మారిందన్నారు. మహేష్‌కుమార్ గౌడ్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శలను నిరసిస్తూ మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, శేఖర్, ఫారూఖ్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల ఓటర్ల తుది జాబితా విడుదల

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 46 గ్రామపంచాయతీల ఓటర్ల తుది జాబితాను, పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను మంగళవారం కార్యాలయంలో ఎంపీడీవో శేషగిరిశర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పంచాయతీ వార్డుల సంఖ్య మొత్తం 394 ఉండగా పురుష ఓటర్లు 27,338, మహిళా ఓటర్లు 28233, ఇతరులు 7 మంది మొత్తంగా 5,55,787 మంది ఉన్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

వేములపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా తమ సమస్యలను పరిష్క రించాలని కోరుతూ వేములపల్లి మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని, కోరారు. ప్రిన్సిపాల్ జి.దీనసుజాత, ప్రసాద్, అంజయ్య, పురుషోత్తం, కిరణ్, రవీందర్, మల్లేశ్, కోటేష్, ఖలీల్, మీనాకుమారి, నయుమున్నీసా, షబానా, ఉపేందర్, కమల్‌హాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దంపల్లి వాసికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు



అంబేడ్కర్ అవార్డు అందుకుంటున్న జీవ

దేవరకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దంపల్లి గ్రామానికి చెందిన దళిత నాయకుడు సలికినేని జీవ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈనెల 15న న్యూఢిల్లీలోని గోదావరి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు అంబేడ్కర్ భావజాలంతో సాహిత్య రంగంలో రాణించి సేవలు అందించినందుకు అవార్డు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. జీవకు అవార్డు రావడం పట్ల దేవరకొండలో తెలంగాణ సాహితీ సాంస్కృతిక అధ్యాయన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు పర్వావాసుదేవరావు, రంజాన్‌బేగ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అంజనేయులు, పండ్ల శ్రీను, వేర్వేరు ప్రకటనలో హర్షం ప్రకటించారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు : ఆర్టీసీ డీఎం

దేవరకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు లక్కీడ్రా ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్లు దేవరకొండ డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం దేవరకొండ డిపోలో డీలక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళలకు ప్రతి 15 రోజులకు ఒక్కసారి లక్కీడ్రా ద్వారా ముగ్గురుని ఎంపిక చేసినట్లు తెలిపారు. మంగళవారం డ్రాలో హైదరాబాద్ గ్రీన్‌పార్కుకు చెందిన సుజాత, నల్లగొండకు చెందిన షకీల, పీఏపల్లి మండలం ఫకీర్‌పూర్‌నకు చెందిన ఎస్.మల్లమ్మలను విజేతలుగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.